విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 165 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/-






# వెనక్కి తగ్గిన రేవంత్ సర్కార్

లగచర్ల భూసేకరణ రద్దు

- లగచర్ల ఫార్మా విలేజి పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- నోటిఫికేషన్ ఉపసంహరించుకున్న ప్రభుత్వం
- స్థానికుల వ్యతిరేకత ప్రధాన కారణం
- ఇండిస్ట్రియల్ కారిడార్ పేరుతో మరో ప్రయత్నం
- టెక్స్‌టైల్ కంపెనీలపై సర్కారు దృష్టి

హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం వికారాబాద్ జిల్లా లగచర్ల ఫార్మా కంపెనీల భూసేకరణ నోటిఫికేషన్‌ను రద్దుచేసింది. నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటూ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చింది. లగచర్లలోని -మిగతా 3 లో



## తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్

- పరిస్థితుల కారణంగా మరోసారి పోరుబాట
- రాష్ట్ర సాధనలో కేసీఆర్ కృషి అనన్యసామాన్యం
- మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్ అనిపార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా అలుగునూరు చౌరస్తాలో శుక్రవారం నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమానికి కేటీఆర్ హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోని పరిస్థితుల కారణంగా మరోసారి పోరాట బాట పట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో -మిగతా 3 లో




## వాతావరణానికి అనుగుణంగా పంటలు పండించాలి

- బోనస్ వల్ల కష్టపడే రైతులకే ఫలితం దక్కుతుంది
- బోనస్ తీసుకున్న రైతుల్లో ఆనందం
- రైతుబంధు కంటే బోనస్సే ఇవ్వాలని రైతుల అభిప్రాయం
- రైతులంటే అందరికీ దానం చేసే జాతి
- రైతు పండుగ వేదికలో ?తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్,

రైతులంటే అందరికీ దానం చేసే జాతి అని, వాతావరణానికి అనుగుణంగా అన్నదాతలు పంటలు పండించాలని స్టేట్? అగ్రికల్చర్? మినిస్టర్? తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా అమిస్తాపూర్‌లో జరిగిన రైతు పండుగ వేదికగా మంత్రి తుమ్మల మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు మహబూబ్‌నగర్‌కు జీవనాడిగా అభివర్ణించారు. పాలమూరుకు వలసల -మిగతా 3 లో



## పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు

- వచ్చే విద్యాసంవత్సరంలో ఇంటర్నల్ మార్కుల ఎత్తివేత
- గ్రేడింగ్ విధానంలో మార్పులేదు : విద్యాశాఖ సవరణ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్

పదోతరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో మార్పులు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం -మిగతా 3 లో

# ఐక్యతే మన ఆయుధం



- పార్టీలో క్రమశిక్షణ చాలా అవసరం
- ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి
- పార్టీ విజయమే తమ గెలుపుగా భావించాలి
- పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుంది
- మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు ఆశించినట్లుగా లేవు
- ఈవీఎంలపై పలు అనుమానాలు ఉన్నాయి
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ,

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కఠిన నిర్ణయాలు అవసరమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఉపయోగిస్తున్న ఈవీఎంలపై కూడా పలు అనుమానాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం దిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో కాంగ్రెస్ జాతీయ -మిగతా 3 లో



## తెలంగాణ గజ..గజ

-పెరిగిన చలి తీవ్రత
-న్యాల్కల్‌లో 7.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతగా నమోదు

హైదరాబాద్,

రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతున్నది. సంగారెడ్డి జిల్లాలోని న్యాల్కల్‌లో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం ఉదయం న్యాల్కల్‌లో 7.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. కోహిర్‌లో -మిగతా 3 లో



## రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ సక్సెస్

- సిద్ధిపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన హరీశ్‌రావు

హైదరాబాద్,

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షకు దిగి నేటితో 15 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ జరుపుతున్నాయి. ఈ సందర్భంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ర్యాలీలు, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీష్‌రావు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్రంలోని రంగదాంపల్లిలో అమరులవీరుల -మిగతా 3 లో

## కాకినాడలో ఇల్లీగల్ వ్యవహారాల అంతు తేలుస్తాం



- అధికారులు అలసత్వం వహిస్తే ఊరుకునేదిలేదు
- డిప్యూటీ సీఎంగా ఉన్న నాకే సహకరించడం లేదు..
- కేంద్రానికి లేఖ రాస్తా: పవన్ కల్యాణ్ ఆగ్రహం
- యాంకరేజ్ పోర్టులో పర్యటించిన పవన్ కల్యాణ్

అమరావతి,

కాకినాడ యాంకరేజ్ పోర్టు అక్రమార్కులకు అడ్డాగా మారింది. కొన్ని ముఠాలు రేషన్ బియ్యం సహా పలు రకాల వస్తువులను ఓడలో విదేశాలకు తరలిస్తున్నాయి. ఈ విషయం తెలుసుకున్న కాకినాడ కలెక్టర్ షాన్ మోహన్ రెండు రోజుల క్రితం సముద్రంలో బియ్యంలోడ్ వెళ్తున్న ఓడను ఛేజ్ చేశారు. సినీఫక్కీలో సముద్రంలోనే ఓడను నిలిపివేసి తనిఖీలు -మిగతా 3 లో

## పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట



హైదరాబాద్,
బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. లగచర్ల ఘటనకు సంబంధించి ఆయనపై నమోదైన మూడు ఎఫ్ఐఆర్‌లలో రెండింటిని హైకోర్టు కొట్టేసింది. ఒక కేసును మాత్రం కొట్టివేయకుండా వదిలేసింది. లగచర్ల ఘటన నేపథ్యంలో బొంరాస్‌పేట పోలీసులు నరేందర్ రెడ్డిపై మొత్తం మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఒకే ఘటనపై వేర్వేరు కేసులు నమోదు చేయడాన్ని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపి తీర్పును రిజర్వ్‌లో పెట్టిన హైకోర్టు శుక్రవారం ఉదయం తాజా ఉత్తర్వులు ఇచ్చింది.

## జైలు జీవితం చిన్న గ్యాప్ మాత్రమే



హైదరాబాద్
జైలుకు వెళ్లొచ్చిన వారు సీఎం అవుతారనుకుంటే కేటీఆర్ కు ఆ ఛాన్స్ లేదని, ఎందుకంటే కవిత ఆల్రెడీ జైలుకు వెళ్లొచ్చారని సీఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ కవిత స్పందించారు. సెన్సేషన్ కోసమే రేవంత్ కామెంట్స్ చేస్తున్నారని ఆమె అన్నారు. తన రాజకీయ ప్రయాణంలో జైలు జీవితం కేవలం చిన్న గ్యాప్ మాత్రమేనన్నారు. లగచర్ల భూసేకరణ రద్దు బీఆర్ఎస్ విజయమన్న కవిత.. హాస్టల్స్‌లో అమ్మాయిలు చనిపోతే ప్రభుత్వం విఫలమైనట్లు కాదా? అని ప్రశ్నించారు

## నేడు తీరం దాటనున్న ఫెంగల్

-తమిళనాడులోని ఏడు జిల్లాలకు హెచ్చరికలు
- స్కూళ్లకు సెలవు, పరీక్షల వాయిదా
- పలు జిల్లాల్లో రెడ్ అలెర్ట్



చెన్నై : ఫెంగల్ తుపాను శుక్రవారం మధ్యాహ్నం తమిళనాడులోని మమల్లపురం (మహాబలిపురం), కరైకల్ (పుదుచ్చేరి) మధ్య తీరం దాటనుందని చెన్నైలో ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఈ ప్రభావంతో తమిళనాడులోని ఏడు తీర ప్రాంతా జిల్లాల్లో శక్రవారం సాయంత్రం చెన్నరు తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. శనివారం సాయంత్రం వరకూ అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని, తుపాను తీరం దాటే సమయంలో గంటకు 70 -80 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశముందని వాతావరణ కేంద్రం హెచ్చరిం చింది. కొన్ని డెల్టా, ఉత్తర కోస్తా జిల్లాలో 24.4 సెంమీలకు పైన అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని రెడ్ ఎలర్ట్ జారీ చేసింది. శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసిన సమాచారం ప్రకారం ఆ సమయానికి ఫెంగల్ తుపాను బంగాళాఖాతంలో చెన్నైకు 480 కిమీ, నాగపట్నానికి 310 కిమీ దూరంలోనూ ఉన్నట్లు తెలిపింది. ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాలపై కదులుతున్నట్లు తెలిపింది. శనివారం మధ్యహ్నానికి తీరం దాటుందని, తమిళనాడులోని ఏడు జిల్లాలు పుదుచ్చేరిలోనూ భారీ లేదా కుండపోత వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. వాతావరణ కేంద్రం హెచ్చరికలతో తమిళనాడు ప్రభుత్వం ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది.

## ముస్లింలకు ఓటు హక్కు వద్దన్న పీఠాధిపతి..కేసు నమోదు

-హైదరాబాద్
ముస్లింలకు ఓటు హక్కు వద్దని వారి ఓటు హక్కును రద్దు చేయాలంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కర్ణాటకలోని విశ్వ ఒక్కలిగ మహా సంస్థానం మఠాధిపతి కుమార చంద్రశేఖరనాథ స్వామీజీపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలకు ఓటు లేకుండా చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. కనిపించిన భూములన్నీ తమవేనని వక్ఫ్ బోర్డు లాక్కోవడం ధర్మం కాదని చెప్పారు. మరోవైపు తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో చంద్రశేఖర స్వామీజీ క్షమాపణలు చెప్పారు. ముస్లింలు కూడా దేశ పౌరులేనని, ఓటు వేసే హక్కు వారికి ఉందని అన్నారు. అయితే ముస్లింలపై స్వామీజీ చేసిన వ్యాఖ్యలపై ఒక సామాజిక కార్యకర్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# అవాంఛిత ప్రకటనలపై ఉక్కుపాదం

-సోషల్ మీడియాను నియంత్రించాల్సిందే
-తల్లిదండ్రుల మనోగతం




న్యూఢిల్లీ
పిల్లల కోసం రూపొందించిన కార్య క్రమాలను అందించే సమ యంలో సామాజిక మాధ్య మాలలో చూపిస్తున్న ప్రకటన లపై పలువురు తల్లిదండ్రులు అభ్యంతరాలు, ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కన్పిస్తున్న అసభ్యకరమైన వ్యాఖ్యలు, అంశాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి ఓ చట్టం అవసరమని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రెండు రోజుల క్రితమే పార్లమెంటుకు తెలియజేశారు. ఆ మర్నాడే 'లోకల్‌సర్కిల్స్' అనే సామాజిక సోషల్ మీడియా వేదిక తన సర్వే నివేదికను బహిర్గతం చేసింది. కొన్ని ఓటీటీలు, సామాజిక మాధ్యమ వేదికలు పెద్దలు లేదా పిల్లల కోసం కార్యక్రమాలు ప్రసారం చేసేటప్పుడు మధ్యలో ఇస్తున్న ప్రకటనలు అభ్యంతరకరంగా ఉంటున్నాయని సర్వేలో పాల్గొన్న ప్రతి 10 మంది తల్లిదండ్రుల్లో ఆరుగురు అభిప్రాయపడ్డారు.

పదహారు సంవత్సరాల లోపు పిల్లలు సోషల్ మీడియా మాధ్యమాలను వాడడంపై నిషేధం విధిస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న సమయంలోనే సర్వే నివేదిక బహిర్గతం కావడం కాకతాళీయమే. పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 16 సంవత్సరాల లోపు వయసున్న వారికి సోషల్ మీడియాను నిషేధిస్తూ ఆస్ట్రేలియా పార్లమెంట్ గురువారం రాత్రి బిల్లును ఆమోదించింది. అంటే ఇకపై వారు ఎక్స్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమ సైట్లను చూడకూడదు. సోషల్ మీడియాలో వస్తున్న అభ్యంతరకరమైన, అసభ్యకరమైన అంశాలపై ఉక్కుపాదం మోపాల్సిందేనన్న డిమాండ్ ప్రపంచవ్యాప్తంగా ఊపందుకుంటోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు అనేక దేశాలు ఆస్ట్రేలియా బాటలో నడవాలని యోచిస్తున్నాయి.

సోషల్ మీడియాలో అశ్లీల ప్రకటనలే కాకుండా గాంబ్లింగ్, గేమింగ్, మహిళల లోదుస్తులు, లైంగిక ఆరోగ్యం, గర్భస్థ శిశువును పెంచే మద్యం, పొగాకు ఉత్పత్తులు తదితర అంశాలపై కూడా అభ్యంతరకరమైన ప్రకటనలు వస్తున్నాయి. ఇలాంటి అవాంఛిత ప్రకటనలను నియంత్రించడంలో విఫలమయ్యే సామాజిక మాధ్యమాలపై భారీగా జరిమానాలు విధించాలని సర్వేలో పాల్గొన్న 88 శాతం మంది తల్లిదండ్రులు ముక్తకంఠంతో అభిప్రాయపడ్డారు. దేశంలోని 305 జిల్లాలకు చెందిన 30 వేల మంది అభిప్రాయాలను సేకరించి ఈ సర్వేను రూపొందించారు. ఏ అంశం మీద అయితే కార్యక్రమాన్ని ప్రసారం చేస్తున్నారో దానికి సంబంధించిన ప్రకటనలు మాత్రమే చూపాలని ప్రజలు కోరుతున్నారు. 'మన దేశంలో పిల్లలు తల్లిదండ్రులతో కలిసి కూర్చొని ప్రసారాలు వీక్షిస్తుంటారు. అలాంటప్పుడు మధ్యలో వచ్చే ప్రకటనల విషయంలో సామాజిక మాధ్యమ వేదికలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. తల్లిదండ్రుల అభిప్రాయాలను కాకుండా ప్రసారమయ్యే అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రకటనలు వేయాల్సి ఉంటుంది' అని లోకల్‌సర్కిల్స్ వ్యవస్థాపకుడు సచిన్ తపారియా చెప్పారు.

# శాంతి సామరస్యతలను కాపాడాలి

- యూపీ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ
హింస, ప్రాణ నష్టం, అరెస్టులు, మతోన్మాద ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో పూర్తిగా తటస్థంగా వుంటూ శాంతి సామరస్యతలను కాపాడాల్సిందిగా ఉత్తరప్రదేశ్ పోలీసులకు, సంభాల్ జిల్లా యంత్రాంగానికి సుప్రీం కోర్టు శుక్రవారం కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. 16వ శతాబ్దంలో ఆలయాన్ని ధ్వంసం చేసి దానిపై మసీదును నిర్మించారనే వాదనలను నిర్ధారించేందుకు సర్వే చేపట్టాల్సిందిగా సివిల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన తరుణంలో ఈ ఆదేశాలు వెలువడ్డాయి. కాగా, తమ ముందున్న కార్యకలాపాలను నిలిపివేయాల్సిందిగా సివిల్ కోర్టును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజరు కుమార్‌లతో కూడిన బెంచ్ ఆదేశించింది. సివిల్ కోర్టు అడ్వకేట్ కమిషనర్ రూపొందించిన మసీదు సర్వే నివేదికను సీల్డ్ కవర్‌లో వుంచాల్సిందిగా సుప్రీం కోర్టు ఆదేశించింది. పిటిషనర్, మసీదును నిర్వహించే సంభాల్ షాహి జామా మసీద్ కమిటీపై సుప్రీం కోర్టు పలు చట్టపరమైన చర్యలు తీసుకుంది. సర్వే నిర్వహించాలని లేదా ఆదేశాలు సవరించాలని లేదా అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని కోరుతూ నవంబరు 19న సివిల్ కోర్టు పరోక్షంగా ఇచ్చిన ఆదేశాలను తోసిపుచ్చేందుకు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని 13వ నిబంధనలోని 9వ ఆదేశాల కింద కమిటీ పిటిషన్ దాఖలు చేయవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఖన్నా చెప్పారు. కమిటీ దాఖలు చేసే పిటిషన్‌పై హైకోర్టు విచారించేవరకు ఎలాంటి కార్యకలాపాలను విచారణా కోర్టు చేపట్టరాదని బెంచ్ స్పష్టం చేసింది. సివిల్ కోర్టు ఆదేశాలపై పిటిషన్ దాఖలైతే మూడు రోజుల్లోగా దానిని విచారణాంశాల జాబితాలో చేర్చాలని కోరింది. ఈలోగా ఈ కేసులో ఎలాంటి పరిణామాలు జరుగుతున్నాయో సుప్రీం కోర్టు పర్యవేక్షిస్తూ వుంటుందని అధికారులు తెలుసుకోవాలని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 6తో ప్రారంభమయ్యే వారంలో కమిటీ పిటిషన్‌ను విచారణకు చేర్చాలని సీజేఐ ఆదేశించారు.

# పార్లమెంటులో 'కుటుంబాల' హవా

-నెహ్రూ-గాంధీ ఫ్యామిలీ నుంచి 14 మంది ప్రాతినిధ్యం
-డీఎంకే, ఎన్సీపీ, జేడీఎస్ పార్టీల నుంచి కూడా యాదవులు, సింధియాలు సైతం



న్యూఢిల్లీ
కేరళలోని వాయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ గురువారం పార్లమెంటులో అడుగు పెట్టారు. తద్వారా నెహ్రూ-గాంధీ కుటుంబం నుండి పార్లమెంటులో ప్రమాణస్వీకారం చేసిన 14వ వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ, కేరళలోని వాయనాడ్ స్థానాల నుండి లోక్‌సభకు ఎన్నికైన ప్రియాంక సోదరుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వాయనాడ్ స్థానాన్ని వదులుకోవడం, అక్కడ జరిగిన ఉప ఎన్నికలో ప్రియాంక గెలుపొందడం తెలిసిందే. ప్రియాంక ఎన్నికతో ప్రస్తుతం నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన ముగ్గురు %ా%సోనియా, రాహుల్, ప్రియాంక పార్లమెంట్ సభ్యులుగా కొనసాగుతున్నారు.

**నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులు వీరే**

రాహుల్, ప్రియాంక తల్లి సోనియా గాంధీ లోక్‌సభకు ఆరుసార్లు ప్రాతినిధ్యం వహించారు. ఆమె ఐదుసార్లు రాయబరేలీ నుండి, ఒకసారి అమేథీ నుండి ఎన్నికయ్యారు. ఇక రాహుల్ గాంధీ ఐదుసార్లు ఎంపీ అయ్యారు. ఆయన గతంలో ఒకసారి వాయనాడ్ నుండి, మూడుసార్లు అమేథీ నుండి విజయం సాధించగా ఇప్పుడు రాయబరేలీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన ఇతర నేతల్లో జవహర్‌లాల్ నెహ్రూ, విజయలక్ష్మి పండిట్, ఉమా నెహ్రూ, ఇందిరా గాంధీ, ఫిరోజ్ గాంధీ, శ్యామ్ కుమారి నెహ్రూ, అరుణ్ నెహ్రూ, రాజీవ్ గాంధీ, సంజరు గాంధీ ఉన్నారు. మరో ఇద్దరు గాంధీలు కూడా ఎంపీలుగా ఎన్నికైనప్పటికీ వారు బీజేపీ పక్షాన గెలుపొందారు. మేనకా గాంధీ, వరుణ్ గాంధీ బీజేపీ అభ్యర్థులుగా గెలుపొంది లోక్‌సభ సభ్యులయ్యారు.

కాంగ్రెస్, డీఎంకే నుండి

నెహ్రూ-గాంధీ కుటుంబానికి చెందిన వారే కాకుండా ఇతర కుటుంబాలకు చెందిన సభ్యులు కూడా ప్రస్తుతం ఉభయ సభల్లో ఉన్నారు. కాంగ్రెస్ విషయానికి వస్తే కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం రాజ్యసభలో, ఆయన కుమారుడు కార్తి చిదంబరం లోక్‌సభలో సభ్యులుగా ఉన్నారు. కాంగ్రెస్ మిత్రపక్షమైన డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ కుటుంబం నుండి ఆయన సోదరి కనిమొజి, బంధువైన దయానిధి మారన్ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మారన్ తండ్రి మురసోలీ మారన్ డీఎంకే వ్యవస్థాపకుడు కరుణానిధి మేనల్లుడే.

**చట్టసభల్లో యాదవ నేతలు**

ఇక యాదవ్ కుటుంబం నుండి చాలా మంది పార్లమెంట్ సభ్యులయ్యారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆయన భార్య డింపుల్ యాదవ్‌తో పాటు పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ సోదరుల కుమారులు ధర్మేంద్ర యాదవ్, ఆదిత్య యాదవ్ లోక్‌సభ సభ్యులుగా కొనసాగుతున్నారు. ములాయం సోదరుడు రాంగోపాల్ యాదవ్ రాజ్యసభకు, ఆయన కుమారుడు అక్షరు యాదవ్ లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీహార్ నుండి రాజేష్ రంజన్ అలియాస్ పప్పూ యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందగా ఆయన భార్య రంజీత్ రంజన్ రాజ్యసభ సభ్యురాలు. ఆమెను కాంగ్రెస్ పార్టీ ఛత్తీస్‌గఢ్ నుండి ఎగువసభకు నామినేట్ చేసింది.

# వెనక్కి తగ్గిన రేవంత్ సర్కార్..

(మొదటి తరువాయి)

580 మంది రైతులకు చెందిన 632 ఎకరాలను సేకరించాలని గతంలో సర్కారు నిర్ణయించిన సంగతి తెలిసిందే. గత ఆగస్టు 1న ఈ నోటిఫికేషన్‌ను జారీ చేసిన ప్రభుత్వం రైతుల ఆందోళనల నేపథ్యంలో వెనక్కి తీసుకుంది.

అసలు జరిగిందేంటి?

ఔషధ పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ నిమిత్తం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో నిర్వహించతలపెట్టిన గ్రామసభ గందరగోళమైంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో జరిగిన ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. భూసేకరణకు వ్యతిరేకంగా స్థానిక రైతులు గత కొంతకాలంగా నిరసనలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామసభ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ సహా ముఖ్య అధికారులంతా అక్కడికి వెళ్లారు. ఆ సమయంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్(కడా) ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని ఆయా గ్రామాల రైతులు ఘేరావ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. దాడిలో పలువురు అధికారులకు గాయాలయ్యాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ ఎమ్మెల్యేతో సహా పలువురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అధికార, ప్రతిపక్షాల మధ్య ఈ విషయమై వాదోపవాదాలు, పరస్పర ఆరోపణల మధ్య రాష్ట్రవ్యాప్తంగా రాజకీయం వేడెక్కింది. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన వామపక్షాలు ప్రజలతో నేరుగా చర్చించడం, ఆపైన ప్రజాభిప్రాయాన్ని ముఖ్యమంత్రికి విన్నవించడం జరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలో లగచర్ల భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవడం గమనార్హం.

### మరో పేరుతో నోటిఫికేషన్?

ఫార్మా పరిశ్రమలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసిన రైతులను మెప్పించేందుకు సర్కారు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో చేసేందుకు మరో రూపంలో భూసేకరణ నోటిఫికేషన్ జారీచేయనుందని తెలిసింది. ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో ఇతర పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇతర కంపెనీలైతే పర్యావరణ కాలుష్యం ఉండబోదనీ, యువతకు భారీగా ఉద్యోగావకాలు వచ్చే అవకాశంముంటుందని ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రధానంగా టెక్స్‌టైల్ కంపెనీలకు ప్రాధాన్యత ఇచ్చే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది.

# తెలంగాణ రాష్ట్ర సమితికి జన్మస్థలం కరీంనగర్

(మొదటి తరువాయి)

కేసీఆర్ కృషి అనన్య సామాన్యమైనదని కేటీఆర్ కొనియాడారు. కేసీఆర్ పదవులు ఆశించకుండా తెలంగాణ కోసం కృషి చేశారని తెలిపారు. కేసీఆర్ అనేది పేరు కాదు.. తెలంగాణ పోరు అని పేర్కొన్నారు. కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణ సాధించామని తెలిపారు. కానీ ఆనాడు ఉద్యమంలో అడ్రస్ లేని వాళ్లు ఇవాళ తెలంగాణ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆనాడు ఉద్యమంలో మన మీదకు తుపాకీ తీసుకొచ్చినోడు ఇవాళ మాట్లాడుతున్నాడని రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియా గాంధీ తెలంగాణ ఇవ్వకపోతే మీరు నాంపల్లి దర్గా దగ్గర అడుక్కుతినే వాళ్లని తెలంగాణ ప్రజల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి ఇవాళ అదృష్టవంతుడు.. అధికారం ఆయన దగ్గర ఉందని కేటీఆర్ అన్నారు. అధికారం నీ దగ్గర ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల అభిమానం మాత్రం కేసీఆర్‌కు, గులాబీ జెండాకే ఉందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపించారని కాంగ్రెస్ నాయకులపై మండిపడ్డారు. దొంగ మాటలు, నంగనాచి కబుర్లు చెప్పి నువ్వు గెలవచ్చు కానీ.. ఏ రోజుకైనా తెలంగాణ చరిత్ర రాసిన రోజు కేసీఆర్ హిమాలయ పర్వతమంతా ఎత్తులో ఉంటే.. కనీసం ఆయన కాలి గోటికి కూడా సరిపోని పాత్రలో ఉంటావనేది అక్షర సత్యమని చెప్పారు. దమ్ముంటే నీ ఏడాది పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఏ ఊరికైనా, ఏ తండాకైనా, ఏ బస్తీకైనా వెళ్లమని సవాలు విసిరారు. కాంగ్రెస్ ఏడాది పాలనతో తెలంగాణలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేరని కేటీఆర్ అన్నారు. ఆఖరకు గురుకులాల్లో ఉండే పిల్లలు కూడా ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. హాస్టల్‌లో బువ్వ తిని ఆస్పత్రి పాలయ్యే పరిస్థితి ఉందని మండిపడ్డారు. హాస్టల్ విద్యార్థులు తిండి కోసం అలమటిస్తున్నారని అన్నారు. ఇది ఏడాది పాలనలో రాష్ట్ర పరిస్థితి అని అన్నారు. ఈ పాటి దానికి విజయోత్సవాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. వచ్చే నాలుగేళ్లు ప్రజల పక్షాన ఉద్యమిద్దామని బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు.

## వాతావరణానికి అనుగుణంగా
# పంటలు పండించాలి

(మొదటి తరువాయి)

జిల్లా అనే పేరు ఉందని, ఇకపై పాలమూరుకు వేరే ప్రాంతాల నుంచి వలసలు రావాలని కోరారు. ఇక్కడి నుంచి వెళ్లకూడదన్న ఆయన, రైతులకు ఎన్ని బాధలున్నాయో.. ప్రభుత్వానికి అన్ని సమస్యలున్నాయని పేర్కొన్నారు. వచ్చే నాలుగేళ్లలో మహబూబ్‌నగర్‌లోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇరిగేషన్ ప్రణాళిక రూపొందించాల్సి ఉందని, రాష్ట్రానికి పెట్టుబడి పెట్టే జిల్లా మహబూబ్‌నగర్ కావాలని ఆకాంక్షించారు. బోనస్ తీసుకున్న రైతులు ఆనందంగా ఉన్నారన్న మంత్రి, బోనస్ వల్ల రైతుకు రూ.12 వేల నుంచి రూ.15వేలు వస్తున్నాయని స్పష్టంచేశారు. బోనస్ వల్ల కష్టపడే రైతులకే ఫలితం దక్కుతుందని, రైతుబంధు కంటే బోనస్ బాగుందని కొందరు రైతులు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ఒకానొక సందర్భంలో రైతుబంధు కాదు, బోనస్ ఇవ్వాలని రైతులు అంటున్నారని పలికారు. రైతుల అనుభవాల ప్రకారం నిర్ణయాలు తీసుకుంటామన్న ఆయన, రైతుకు మేలు చేసే నిర్ణయాలు తీసుకుంటామని పేర్కొన్నారు. అన్నదాతలు తమకు ఏ పథకం మంచిదో చెబితే, ఆ స్కీములనే కొనసాగిస్తామని అన్నారు. అన్నీ చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పమన్న తుమ్మల, అది చేస్తాం.. ఇది చేస్తాం.. అని రైతులను ఆశలు పల్లకిలో ఊరేగించమని పునరుద్ఘాటించారు. న్యాయంగా, ధర్మంగా ప్రభుత్వం చేయాల్సిందంతా చేస్తామని మంత్రి తుమ్మల అన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల ఆత్మస్థైర్యం దెబ్బతీసేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మంత్రి తుమ్మల తీవ్రంగా ఆరోపించారు. అంతకముందు జరిగిన సభల్లో మంత్రి మాట్లాడుతూ, సన్నబియ్యానికి బోనస్ కచ్చితంగా ఇస్తామని డిసెంబరు 7లోగా రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి చేస్తామని, కేబినెట్ సబ్-కమిటీ రిపోర్ట్? వచ్చిన తర్వాత రైతుభరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్, బీజేపీలు ఆయా పార్టీలో అంతర్గత ఆధిపత్యం కోసమో అధికారంలోకి రావాలన్న ఆత్రుతలోనో రైతాంగాన్ని బలిపెట్టవద్దని మంత్రి తీవ్రంగా ధ్వజమెత్తారు.

# ఐక్యతే మన ఆయుధం

(మొదటి తరువాయి)



అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు.మహారాష్ట్ర, హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఊహించని దెబ్బ తగలడంపై కాంగ్రెస్ లోతుగా విశ్లేషిస్తోంది. పార్టీలో ఐక్యత లేకపోవడం, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వంటివి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను దెబ్బకొట్టాయని, ఈ విషయంలో కఠిన క్రమశిక్షణ అవసరమని ఖర్గే అభిప్రాయపడ్డారు. కలిసికట్టుగా పోరాడకుండా, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుంటే ప్రత్యర్థులను ఎలా ఓడించగలం? అని ప్రశ్నించారు. కఠిన నిర్ణయాలు తీసుకోవడం అవసరమన్న ఖర్గే, ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాలని పార్టీ నేతలకు హితబోధ చేశారు. "పార్టీలో క్రమశిక్షణ చాలా అవసరం. ఎట్టి పరిస్థితుల్లోనూ అందరం ఐక్యంగా ఉండాలి. ఇదే మన ఆయుధం. పార్టీ విజయమే తమ గెలుపు అని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. పార్టీ బలంపైనే మన శక్తి ఆధారపడి ఉంటుందని భావించాలి. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పనితీరుతో నూతనోత్సాహంతో పునరాగమనం చేసింది. మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం పార్టీ ఆశించినట్లుగా లేవు. ఇండియా కూటమి పార్టీలు నాలుగు రాష్ట్రాలకు గాను రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయి. కానీ మన పార్టీ పనితీరు ఆశించిన విధంగా లేదు. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారతుంది" అని ఖర్గే తేల్చి చెప్పారు."సమయానుకూలంగా వ్యూహరచన చేసి పార్టీని బలోపేతం చేసేందుకు నేతలంతా మరింతగా కష్టపడాలి. అసెంబ్లీ ఎన్నికలకు కచ్చితంగా ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలి. ఓటర్ల జాబితాలను పరిశీలించాలి. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (%జుఎవీ%) ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయి. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా జరిగేలా ఎలక్షన్ కమిషన్? వ్యవహరించాలి. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి సాధించిన ఫలితాలు, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోని ఫలితాలు చూసి రాజకీయ విశ్లేషకులు కన్‌ఫ్యూజన్‌లో పడ్డారు" అని ఖర్గే అన్నారు. "కాంగ్రెస్ కచ్చితంగా ఎన్నికల వ్యూహాన్ని మెరుగుపరుచుకోవాలి. క్యాంపెయిన్‌ను మెరుగుపరిచేందుకు, తప్పుడు సమాచారాన్ని ఎదుర్కోవడానికి మెరుగైన మార్గాలను అభివృద్ధి చేసుకోవాలి. దేశంలో ప్రజల ఎజెండాను అమలు చేసేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం చాలా ముఖ్యం. లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్? పార్టీ ఆశించిన ఫలితాలు సాధించలేదు. ఇది పెద్ద కుదుపే అని చెప్పవచ్చు. కనుక పార్టీ బలోపేతానికి కఠినమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ఈ ఫలితాలతో నిరాశ చెందడం కాకుండా, పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకురావాలి" అని ఖర్గే సూచించారు.

# పాత పద్ధతిలోనే టెన్త్ పరీక్షలు

(మొదటి తరువాయి)

చేసింది. 20 ఇంటర్నల్ మార్కులుంటాయని వివరించింది. 80 మార్కులకే వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని వివరించింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం శుక్రవారం సవరణ ఉత్తర్వులను జారీ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. వంద మార్కులకు వార్షిక పరీక్షలుంటాయని ప్రకటించిన మరుసటి రోజే వెనక్కి తగ్గడం గమనార్హం. ప్రస్తుత విద్యాసంవత్సరంలో పాత పద్ధతిలోనే పదో తరగతి వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి 20 ఇంటర్నల్ మార్కులను ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. వంద మార్కులకు వార్షిక పరీక్షలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తామని తెలిపారు. గ్రేడింగ్ విధానం అమల్లో ఎలాంటి మార్పు లేదని వివరించారు. పదో తరగతి పరీక్షల్లో చేసిన మార్పుల పట్ల ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నుంచి విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం గమనార్హం. అయితే ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే పదో తరగతి వార్షిక పరీక్షల్లో 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చే విధానం అమల్లోకి రానుంది. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లకు మాత్రం 12 పేజీల చొప్పున వేర్వేరుగా బుక్‌లెట్‌లను ఇస్తారు.

## తెలంగాణ
# గజ..గజ

(మొదటి తరువాయి)

9.2 డిగ్రీలు, గుమ్మడిదలలో 9.2, సత్వార్‌లో 9.3, మెదక్ జిల్లా శివ్వంపేటలో 8.9, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేటలో 10.9 డిగ్రీలు నమోదయింది. ఇక ఆదిలాబాద్‌లో 9.7 డిగ్రీలు, పటాన్‌చెరులో 12.2, హనుమకొండలో 13.5, రామగుండంలో 13.8, నిజామాబాద్‌లో 14.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కాగా, రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదు కావడం చలి తీవ్రతకు అద్దంపడుతున్నది. ఉదయం 8 దాటినా ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటే వణికిపోతున్నారు. చలిమంటలు వేసుకుని కాచుకుంటున్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా భీమ్‌పూర్-టీలో అత్యల్పంగా 8.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యూ)లో 8.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 9.4 డిగ్రీలు, మెదక్ జిల్లా శివ్వంపేటలో 9.5 డిగ్రీలు, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో 10 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా జుక్కల్‌లో 10.4 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా కోట్‌గిరిలో 10.4, కొండపాకలో 10.6 డిగ్రీలు, నిర్మల్ జిల్లా పెంబిలో 10.7 డిగ్రీలు, వికారాబాద్ జిల్లా మరిపల్లిలో 10.8 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# కాకినాడలో ఇల్లీగల్ వ్యవహారాల అంతు తేలుస్తాం

(మొదటి తరువాయి)

చేశారు. 5 కంటైనర్లలో విదేశాలకు తరలిస్తోన్న 38వేల టన్నుల బియ్యాన్ని పట్టుకున్నారు. వీటిలో 640 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఓడను కస్టమ్స్ అధికారుల బోట్లకు కట్టేసి కాకినాడ పోర్టుకు తీసుకొచ్చి దర్యాప్తు చేస్తున్నారు. ఓడలో భారీ ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడ్డ విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ పోర్టును సందర్శించారు. మంత్రి నాదెండ్ల మనోహర్‌తో కలిసి బోటులో సముద్రం లోపలికి వెళ్లారు. కలెక్టర్ షాన్ మోహన్ పట్టుకున్న రేషన్ బియ్యాన్ని పరిశీలించారు. యాంకరేజ్ పోర్టు నుంచి టన్నుల కొద్దీ రేషన్ బియ్యం అక్రమంగా రవాణా అవుతుంటే ఏం చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు పవన్ కల్యాణ్. పోర్ట్ ఆఫీసర్ ధర్మ శాస్త్ర, డీఎస్పీ రఘు వీర్, సివిల్ సప్లై %ణూా% ప్రసాద్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే వనమాడి కొండబాబుకి సైతం పవన్ కల్యాణ్ చురకలు అంటించారు. పోర్టులో అక్రమాలు జరుగుతుంటే మౌనంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. అధికారుల తీరుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. పట్టుబడ్డ బియ్యాన్ని పరిశీలించేందుకు వెళ్లిన తనకు అధికారులు సరిగా సహకరించలేదన్నారు పవన్ కల్యాణ్. బియ్యం అక్రమ రవాణా ముఠా వేళ్లూనుకుపోయినట్టు కనిపిస్తుందన్నారు. కాకినాడ తీరంలో భద్రత పేలవంగా ఉందన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. భద్రతపై కేంద్రానికి లేఖ రాస్తానన్నారు.. అధికారుల పేర్లను సేకరించాలని అధికారులను ఆదేశించారు.. కాకినాడ పోర్టు స్మగ్లింగ్‌కు అడ్డాగా మారిందని.. స్మగ్లింగ్ అనేది కేవలం బియ్యంతో ఆగదంటూ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వంద కిలోల %=ణశ% తీసుకొస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను కాకినాడకు వస్తానంటే రావొద్దని కొందరు మెసేజ్‌లు చేశారని.. మంత్రి చెప్పినా చర్యలు చేపట్టడంలేదంటూ అధికారులపై మండిపడ్డారు. డిప్యూటీ సీఎంగా ఉన్న తనకే అధికారులు సహకరించడం లేదన్నారు.. ఏపీ గంజాయికి అడ్డాగా మారిందంటూ ఫైర్ అయ్యారు.. రూపాయి పెట్టుబడి లేకుండా రేషన్ బియ్యాన్ని తీసుకెళ్లి ఆఫ్రికా దేశాల్లో కిలో 70కి అమ్ముతున్నారని పవన్ మండిపడ్డారు. అక్రమ బియ్యాన్ని తరలిస్తోన్న వారిపై చర్యలు తప్పవన్నారు మంత్రి నాదెండ్ల మనోహర్. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ వల్లే కాకినాడ పోర్టుకు చెడ్డపేరు వచ్చిందని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపించారు.

# రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ సక్సెస్

(మొదటి తరువాయి)

స్థూపం దగ్గర అంజలి ఘటించారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో జరుగుతున్న దీక్షా దివస్ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, జిల్లా బీఆర్ఎస్ ఇన్‌చార్జి గంగాధర్ గౌడ్ పాల్గొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహిస్తున్నారు. వరంగల్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆధ్వర్యంలో దీక్షా దివస్ కార్యక్రమం ఘనంగా జరుగుతోంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో దీక్షా దివస్ జరుపుకుంటున్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## సంపాదకీయం

# మహా' సునామీ మిగిల్చిన సంశయాలు

మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయానికి నేను ఆశ్చర్యపోలేదు అలాగే విజయావకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతిపక్ష ఎమ్‌వీఏ కూటమి ఓడిపోవడం కూడా నన్ను విస్మయపరచలేదు అయినప్పటికీ సునామీ లాంటి మహాయుతి విజయాన్ని నేను అర్థం చేసుకోలేక పోతున్నాను. నా రాజకీయ ఇంగితజ్ఞానం గానీ, రాజనీతిశాస్త్ర పరిజ్ఞానం గానీ మహారాష్ట్ర ఎన్నికల అంతిమ ఫలితాలను అర్థం చేసుకోవడానికి తోడ్పడం లేదు! విజేతకు తోడ్పడిన విజయ బలవర్ధకాలు ఏమిటి అని నన్ను నేను ప్రశ్నించుకోక తప్పలేదు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలపై సంశయాలు నెలకోవడమనేది చాలా తీవ్ర విషయం. అధికారిక ఎన్నికల ఫలితాలను ప్రశ్నించవచ్చు. అయితే అది కొన్ని ప్రాథమిక పరీక్షలలో నెగ్గవలసిన అవసరమున్నది: ఆ ఫలితాలకు దారితీసిన బలమైన కారణాలను వివరించాల్సిన అవసరమున్నదా? పలువురు ఇస్తున్న వివరణలు నమ్మదగినవి కావా? ఈ రెండింటినీ నిశితంగా పరిశీలిద్దాం. మహారాష్ట్ర ఎన్నికలు అనేక విధాలుగా ఆశ్చర్యాన్ని గొలిపాయి. మహాయుతి విజయం విస్మయకరమైనదేగాక దిగ్భ్రాంతికరమైనది కూడా. నాలుగింట మూడు వంతుల సీట్లను ఆ కూటమి కైవసం చేసుకున్నది. దాని ఓట్ల వాటా 14 శాతం అధికంగా ఉన్నది. ఇటువంటి విజయాలు అరుదైనవి. అయితే అసాధ్యమైనవి కావు, ఇంతకుముందు విననివి కూడా కాదు. మహారాష్ట్ర రాజకీయాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే అంశాలు అన్నీ ఈ ఎన్నికలలో కానరాకుండా పోవడం ఆ ఆశ్చర్యాన్ని మరింత అధికం చేస్తోంది. రాష్ట్రంలోని విభిన్న ప్రాంతాల మధ్య అభివృద్ధిపరంగా అసమానతలు, భిన్న కూటములలోని పార్టీల మధ్య ఉన్న వివిధ అంతరాలు అన్నిటినీ అదృశ్య హస్తం ఏదో మటు మాయం చేసినట్టుగా కనిపిస్తోంది. మహాయుతి విజయంలోని నాటకీయ స్వభావమూ విస్మయం కలిగిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడమే కాకుండా 14 శాతం అధిక్యతను మహాయుతి సాధించింది. అదీ ఐదు నెలల్లో ఎలా సాధ్యమయింది? ఏమైనా మహారాష్ట్ర పాలక కూటమి విజయం భారతదేశ ఎన్నికల చరిత్రలో అపూర్వమైనదేమీ కాదు. మహారాష్ట్రలో ఎన్నికల చరిత్రను నిశితంగా చూస్తే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ గణనీయమైన సీట్లు సాధించుకోగలగడానికి ఆస్కారం లేదు. ఈ కారణంగానే మహాయుతి విజయాన్ని ఎవరూ పసిగట్టలేక పోయారు. ఎన్నికల పవనాలు వేగంగా, అనూహ్యంగా తప్పుడు దిశలో వీచాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే మహాయుతి విజయం నిజానికి ఒక ఎన్నికల గూగ్లీ. మహారాష్ట్రలో సంభవించిన దానికి సబబైన వివరణ ఏమైనా ఉన్నదా? కొన్ని ప్రామాణిక వివరణలను పరిశీలిద్దాం. తమకు లభించిన మంచి అవకాశాన్ని ఎమ్‌వీఏ నాయకులు వ్యర్థం చేసుకున్నారనేది వాటిలో ప్రధానమైనది. లోక్‌సభ ఎన్నికలలో చేకూరిన విజయంతో అమిత సంతృప్తితో ఉండిపోయి, వ్యర్థ కలహాలతో కాలం గడుపుతూ దూరదృష్టి లేకుండా వ్యవహరించారనేది ఎమ్‌వీఏ నేతలపై ఒక ప్రధాన ఆక్షేపణ. ఇది చాలవరకు నిజం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎమ్‌వీఏకు ఒక నైతిక స్థైర్యాన్నిచ్చాయి. సమష్టి మనుగడకు ఒక సుదృఢ ప్రాతిపదిక కల్పించాయి. అసెంబ్లీ ఎన్నికల సమరానికి సమాయత్తమయ్యేందుకు అనువైన పరిస్థితులను సృష్టించాయి. ప్రజలను సతమతం చేస్తున్న సమస్యలా? కొల్లలు. శిందే సేన, అజిత్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీలతో కూడిన మహాయుతి ఒక రాజకీయ పాప ఫలం. సిగ్గు మాలిన ఎత్తుగడలతో శివసేన, ఎన్‌సీపీని బీజేపీ చీల్చింది. పరిణత రాజకీయవేత్తగా ఉద్ధవ్ ఠాక్రేకు ప్రజల్లో మంచి పేరు ఉన్నది. కోవిడ్ ఉపద్రవంలో మహమ్మారి బాధితులను ఆదుకోవడంలో ఆయన పాలనా దక్షత రుజువయింది. ఈ అనుకూలతలను ఉపయోగించుకునేందుకు ఎమ్‌వీఏ నాయకులు లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య ఐదు నెలల కాలంలో చేసిందేమీ లేదు. సీట్ల పంపిణీపై సత్వరమే ఒక నిర్ణయానికి రాలేకపోయారు. ఎన్నికల వాగ్దానాలను ప్రకటించడంలో జాప్యం చేశారు. మరీ ముఖ్యంగా ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో తేల్చుకోలేక పోయారు. బీజేపీ ఎత్తుగడలకు పై ఎత్తుగడలు వేయలేకపోయారు. లోక్‌సభ ఎన్నికలలో పరాజయం నుంచి బీజేపీ నేతృత్వంలోని మహయుతి సరైన పాఠాలు నేర్చుకున్నది. ఒక పటిష్ఠ పథకాన్ని రూపొందించుకుని సమర్థంగా అమలుపరిచింది. తమ పట్ల వివిధ వర్గాలలో ఉన్న వ్యతిరేకతను తటస్థం చేసింది. ప్రభుత్వ కోశాగారాన్ని ప్రజలకు తెరిచింది. లడ్కీ బహిన్‌తో సహా పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టింది. ఓబీసీలను తన వెనుక సమీకరించుకుంది దళితులలో అట్టడుగున ఉన్నవారిని తన వైపునకు తిప్పుకోగలిగింది. సంఘ్ పరివార్ అంతా మహాయుతి వెనుక మోహరించింది. నకిలీ అభ్యర్థులను నిలబెట్టింది. బీజేపీకి గల అపార ధనశక్తి, మీడియా పలుకుబడిని పూర్తిగా వినియోగించుకున్నది. మరి ఎమ్‌వీఏని మహాయుతి ఎందుకు ఓడించిందో మీకు ఇంకా వివరించాలా? అసెంబ్లీ ఎన్నికలకు మహాయుతి, ఎమ్‌వీఏ సంసిద్ధమైన రీతుల్లో చాలా తేడా ఉన్నది. లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లోటును భర్తీ చేసుకోవడంలోను, అదనంగా ఐదు శాతం ఓట్లను కోల్పోయే ప్రమాదాన్ని అధిగమించడంలోను మహాయుతి ఎందుకు సఫలమయిందో ఆ తేడా విశదం చేస్తుంది. ఈ కారణాలు అన్నీ ఓట్ల కైవశంలో మహాయుతి, ఎమ్‌వీఏపై ఆధిక్యత సాధించేందుకు తోడ్పడింది. అయితే ఎటువంటి ఆధిక్యత అది? నాలుగింట మూడు వంతుల సీట్లను స్వాధీనం చేసుకున్నది. ఓట్ల వాటాలో 14శాతం ఆధిక్యత! నేను హతాశుడిని అయ్యాను. ఇంత మహావిజయాన్ని మీడియా గానీ, ఓటర్ల సర్వేలు నిర్వహించినవారు గానీ, చివరకు విజేతలతో సహా రాజకీయ నాయకులుగానీ ముందుగా ఊహించలేకపోయారు. ఎవరూ సమగ్రంగా వివరించలేకపోతున్నారు. సరే, ఎన్నికల ఫలితాలు ఇప్పుడు అందరినీ విస్మయపరచడం పరిపాటి అయిపోయింది. ఒక నిర్దిష్ట పార్టీ హవా ఉధృతంగా ఉన్న ఎన్నికలు నాయకులు, పరిశీలకులు, విలేఖర్లు, ఓటర్ల సర్వేల నిర్వాహకులతో సహా ప్రతి ఒక్కరినీ విస్మయపరుస్తాయి. 1977లో ఉత్తర భారతావనిలో జనతా పార్టీ, 1985లో రాజీవ్‌గాంధీ, 2019లో వాయవ్య భారతంలో మోదీ సానుకూల పవనాలు ఎలా వీచాయో నేను చూశాను. ఎవరు గెలవగలరో ప్రతి ఒక్కరూ సులభంగా చెప్పగలిగేవిగా సదరు ఎన్నికలు ఉండేవి. ఆయా పార్టీలకు లభించగల సీట్లపై అంచనాలు అటూ ఇటూగా ఉండేవి. విజేత ఎవరో కచ్చితంగా చెప్పగలిగి ఉండేవారు. అయితే మహారాష్ట్ర ఎన్నికలు ఇందుకు పూర్తిగా విరుద్ధమైనవి. వీటి గురించిన రాసినవారెవ్వరూ అంతిమ ఫలితాలను ఏ మాత్రం ఊహించలేకపోయారు.

# తెలంగాణ సాధనకు బాటవేసిన కేసీఆర్ దీక్ష

మన కళ్ళతో మనం చూసిన ఉద్యమం స్వరాష్ట్ర ఉద్యమం. దీన్ని కనికట్టు చేసి కథలల్లి వక్రీకరించలేరు. 'కేసీఆర్ సచ్చుడో ...తెలంగాణ వచ్చుడో' అన్నది ఉద్యమ ట్యాగ్ లైన్. ముంబయ్, బొగ్గుబాయ్, దుబాయ్ వలస బతుకులు తెలంగాణ కన్నీటి గాథలు. నీళ్ళు లేని ఊళ్ళు, నెర్రలు బాసిన నేలలే తెలంగాణ చిత్రపటమైంది. నీళ్ళు, నిధులు, కొలువులు తెలంగాణ అస్తిత్వ జెండా. తీరొక్క తీరుగా ఉద్యమం మలుపులు తిరుగుతున్నా పట్టీ పట్టనట్లు నటించిన కుట్రాజకీయ పార్టీలను చరిత్ర మరిచిపోదు. తెలంగాణ బిడ్డల ఆకాంక్షలు గెలవాలంటే ఇక ఆమరణ నిరాహారదీక్ష తప్పదని గాంధేయ మార్గంలో చివరి పోరుకు శ్రీకారం చుట్టారు కల్వకుంట్ల చంద్రశేఖరరావు. నా మరణమైనా ఉద్యమ కదలికై ఉప్పొంగాలే, నా ఆమరణ దీక్ష ఉద్యమ ప్రాణం కావాలేనన్న దీక్షతో కదిలిన ఉద్యమకారుడు కేసీఆర్. ఆ బక్కమనిషి ఒంటి ప్రాణంతో ఎత్తిన పిడికిలితో ఆ 11 రోజులు తెలంగాణ ఉక్కిరి బిక్కిరైంది. స్వరాష్ట్ర ఉద్యమాన్ని మలుపు తిప్పింది. కేంద్రం తలకిందులైంది. 1956కు ముందు నుంచి 2014 జూన్ 2 తెలంగాణ అవతరణ వరకు తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాలపై జరగని కుట్రలు లేవు. ఆధిపత్య రాజకీయాల కుట్ర పూరిత రాజకీయాలతో 1969 ఉద్యమం నెత్తుటిమయమైంది. పెద్దమనుషుల ఒప్పందాలు ఉల్లంఘనలు అయినాయి. ఉద్యమాన్ని నిర్దాక్షిణ్యంగా అణిచివేసి తెలంగాణ అస్తిత్వం గొంతు నులిమిన కుట్రపూరిత రాజకీయాలను తుత్తునియలు చేసే మహాశక్తి కేసీఆర్ రూపంలో రాజకీయ ప్రక్రియగా తెలంగాణ ఉద్యమ జెండాను ఎత్తింది. 1956 తర్వాత పెరిగిన అసమానతలు, నీళ్ళు లేక భూములు ఎండిపోవటాలు, తెలంగాణకు నిధులు కేటాయించని ఆధిపత్య పాలనలు, ఆర్థికంతో పాటు సామాజిక సాంస్కృతిక ఆధిపత్యాలు, పెద్దమనుష్యుల ఒప్పందాల ఉల్లంఘనలు కేసీఆర్ చేపట్టిన ఉద్యమానికి ప్రాణాలయ్యాయి. 1950 నుంచి 2001 వరకు ఆధిపత్యం కింద నలిగిపోయిన తెలంగాణను రాజకీయ ప్రక్రియ ద్వారా కేసీఆర్ తట్టి లేపారు. 1960 దశకం తర్వాత సినిమా రంగం, రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, ప్రైవేట్ విద్య, కార్పోరేట్ ఆసుపత్రులు, రవాణా రంగాలు తెలంగాణలో తీవ్ర ప్రాంతీయ అసమానతలకు దారితీశాయి. 1950లో నాన్ ముల్కీ గోబ్యాక్‌గా ఎగిసిన ఉద్యమం ఆత్మగౌరవ తెలంగాణ ఉద్యమమైంది. కాని దాన్ని అణిచివేశారు. 1969-%-%71 సంవత్సరాల్లో నెత్తుటేర్లలో



ముంచారు. 1990 దశకంలో తెలంగాణ ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలు పూర్తిగా ఆధిపత్య రాజకీయాల చేతుల్లోకి పోయాయి. ఈ దశకంలోనే తెలంగాణ సమస్యలు ప్రధానాంశాలుగా ముందుకొచ్చాయి. ఈ చారిత్రక సందర్భంలోనే 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ ఏర్పడింది. కేసీఆర్ ఉద్యమ వ్యాప్తి విస్తృతంగా చేశారు. ఉద్యోగుల సమ్మెలు, విద్యాలయాలు కదనరంగాలుగా మారాయి. ప్రజాసంఘాలు తమ పాత్ర పోషించాయి. కేసీఆర్ రాజకీయ ప్రక్రియ ద్వారా దేశంలో 36 రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టారు. ఆధిపత్యవాద రాజకీయ పార్టీల చేత జై తెలంగాణ అనిపించారు. తెలంగాణ ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న ఆకాంక్షలను మలిదశ ఉద్యమంలో రగిలించిన మహాశక్తిగా కేసీఆర్ నిలిచారు. నీళ్ళు నిధులు ఉద్యోగాల్లో జరిగిన దగాను చెప్పటమే గాక, తెలంగాణ ఆటపాట మాటలను ఎంత నిర్లక్ష్యం చేశారో కేసీఆర్ విప్పి చెప్పారు. తన నేలపై భాషా సంస్కృతులపై జరుగుతున్నదాడిని తిప్పికొడుతూ ఉద్యమం కన్నెర్ర జేసింది. టీఆర్ఎస్ రాజకీయ ప్రక్రియ నేతృత్వంలో ఈ నేల మీద ఉన్న అన్ని రాజకీయ పార్టీలను ఒక తాటిపైకి తీసుకురావటంలో కేసీఆర్ ఎత్తుగడలు, చొరవ, వ్యూహాలు, ప్రతివ్యూహాలు సామాన్యమైనవి కావు. ఉద్యమబలాన్నంతా రాజకీయ ప్రక్రియగా మలిచి కేంద్రంపై ఒత్తిడి తేవటానికి టీఆర్ఎస్ బలమైన సాధనంగా పనిచేసింది. తెలంగాణ ప్రజల్లో ఉన్న పౌరుషాన్ని మండించటంలో కేసీఆర్ అగ్గిమంటై నిలిచారు. తెలంగాణ మహోన్నత సంకల్పాన్ని గాంధేయ మార్గంలో రాజకీయ ప్రక్రియగా మలిచి దాన్ని లక్షలాది ప్రజల సింహగర్జనగా, జనఘోషగా కేసీఆర్ మార్చగలిగారు. ఇదే టీఆర్ఎస్ బలానికి నిదర్శనంగా నిలిచింది. కేసీఆర్ అన్నికోణాల నుంచి ఉద్యమాన్ని రగిలించి ఆమరణ నిరాహారదీక్షకు దిగారు. 2009 నవంబర్ 29 నుంచి డిసెంబర్ 9 వరకు 11 రోజులు కేసీఆర్ చేసిన ఆమరణ దీక్ష మొత్తం తెలంగాణ సమాజాన్ని కదిలించింది. 29న సిద్దిపేటలో ఆమరణ దీక్షను అడ్డుకుని అరెస్టు చేయటంతో తెలంగాణ అట్టుడికిపోయింది. కేంద్రం కదిలిపోయింది. కేసీఆర్ తన మాటల్ని తూటాలుగా మార్చాడు. ప్రజా ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమ ప్రక్రియగా మలిచాడు. అమరుల త్యాగాలతో తెలంగాణ తల్లడిల్లుతుంటే కేసీఆర్ తన ఆమరణ నిరాహారదీక్షతో కేంద్రం కళ్లు తెరిపించాడు. 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ప్రక్రియ ప్రారంభం అన్న ప్రకటన తెప్పించగలిగిన ధీశాలి, శక్తిమంతుడు కేసీఆర్. తెలంగాణ ప్రజలంతా ఏదైతే కోరుతున్నారో దానికి టీఆర్ఎస్‌ను నాలుకగా మలిచిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుడిగా కేసీఆర్ చరిత్రలో మిగిలిపోతారు. తెలంగాణ చరిత్ర సామాజిక, భౌగోళిక, ఆర్థిక రాజకీయ పరిస్థితుల పట్ల ఆయనకు ఉన్న పరిజ్ఞానం అపారం. గొప్ప బుద్ధికుశలత, ఆలోచనలు, సైద్ధాంతిక అవగాహనతో పాటు ఆధునిక రాజకీయాలలో ఆయన అవగాహన లోతైనది. తెలంగాణపై గంటలు గంటలు మాట్లాడగల వాగ్ధాటి ఆయనకు పెట్టని ఆభరణం. ఉద్యమం కోసం ప్రాణాన్ని పణంగా పెట్టి ప్రత్యేక రాష్ట్రం రావాలన్న సత్యాగ్రహి కేసీఆర్. తెలంగాణ రాష్ట్ర సాధన అన్న నిబద్ధత నిమగ్నతలతో నిండిన మహోద్యమ స్వరూపం కేసీఆర్. చరిత్రలో కేసీఆర్ లాంటి నాయకులు అరుదుగా కన్పిస్తారు.

# తెలంగాణలో మళ్లీ సెంటిమెంట్ రాజకీయం

అధికారంలో ఉన్నపుడు రాజకీయ పార్టీలకు గతం గుర్తుకు రాదు. పవర్ ఒకసారి చేజారాకే వాటికి తత్వం బోధపడుతుంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలలో నెల కొన్న రాజకీయ పరిస్థితులు అందుకు తాజా ఉదాహరణ. ఆంధ్రప్రదేశ్ విషయాన్ని ప్రస్తుతానికి అటుంచితే...ప్రస్తుతం తెలంగాణలో రాజకీయాలు వాడివేడిగా సాగుతున్నాయి. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన నాటి టీఆర్ఎస్ ..ప్రస్తుత బీఆర్ఎస్ నేతలు గత ఎన్నికల్లో ఓటమిని ఇప్పటికీ జీర్ణించుకున్నట్టు లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే నెల నాటికి ఏడాది పూర్తవుతుంది. కాబట్టి, తెలంగాణలో సమీపంలో ఎన్నికలు లేవు. మరో నాలుగేళ్ల తర్వాత ఎన్నికలు వస్తాయి. కేంద్రం జమిలీ ఎన్నికలు ఆలోచన చేస్తే.. మరో ఐదారు నెలలు ఆలస్యం అవుతుంది. ఎందుకంటే తెలంగాణ ఎన్నికలను లోక్ సభతోనే కలుపుతుంది కానీ ముందే నిర్వహించరు. అయినా రాజకీయాలు మాత్రం వేడి తగ్గడం లేదు. పోటాపోటీగా అధికార విపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయి. తాజాగా సెంటిమెంట్ రాజకీయాలు కూడా ప్రారంభించాయి. తెలంగాణ సాధనలో కీలక ఘట్టం బావించే కేసీఆర్ ఆమరణ దీక్షను ప్రారంభించిన రోజును 'దీక్షా దివస్'గా బీఆర్ఎస్ పార్టీ సెలబ్రేట్ చేసుకుంటోంది. ఇందులో విశేషం ఏమీ లేదు. నిజానికి బీఆర్ఎస్ పార్టీ అస్థిత్వమే తెలంగాణ సెంటిమెంట్. దీక్షాదివస్ వెనక ఉన్నది తెలంగాణ ప్రజల్లో మరోసారి తెలంగాణ సెంటిమెంట్ ని రగిలించటం మినహా మరొకటి కాదు. అధికారంలో ఉన్నప్పుడు కూడా దీక్షా దివస్ నిర్వహించేవారు. కానీ అప్పట్లో క్యాడర్ సాదాసీదాగా చేసుకునేది. అధికార పార్టీగా ఉండటంతో అంత ఊపు ఉండేది కాదు. కానీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారు. ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరంలో ఉన్నారు. రాజకీయంగా యాక్టివ్ గా ఉండటానికి ఇది చాలా అవసరం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు క్రెడిట్ మొత్తం తనదే అని దీని ద్వారా గులాబీ పార్టీ చెప్పదలుచుకుంది. ఆ పార్టీ నేతల ప్రకటనలను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. తెలంగాణలో ఏడాది కాంగ్రెస్ పాలన లోని వైఫల్యాలను ఎండగట్టేందుకు




బీఆర్ఎస్ కు ఈ సందర్భం ఒక వేదికైంది. మరోవైపు, తెలంగాణ ఏర్పాటు ఘనత తమదే అని కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యక్రమం చేపట్టింది. తెలంగాణ ఏర్పాటుపై నాటి హోం మంత్రి చిదంబరం తెలంగాణ ప్రకటన రోజు 2009, డిసెంబర్ 9ని బీఆర్ఎస్ దీక్షా దివస్ కన్నా బలంగా ..ఘనంగా నిర్వహించాలన్న పట్టుదలతో కాంగ్రెస్ ఉంది. అంటే ఇప్పుడు తెలంగాణలో ఉత్సవాల రాజకీయం జోరుగా నడుస్తోందన్నమాట. చిదంబరం ప్రకటన వెలువడిన రోజును కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చిన రోజుగా సంబరాలు చేయబోతున్నారు. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని కూడా ఆవిష్కరిం చబోతున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం ఎట్టి పరిస్థితుల్లోనూ గతంలో బీఆర్ఎస్ ÷నైల్ చేసిన విగ్రహం కాదు. అంతే కాదు పాలనలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మూడో తేదీన బహిరంగసభ నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. అసలు తెలంగాణ అంటేనే ఓ ఎమోషన్ . పొలిటికల్ గా అది చాలా బలమైన ఆయుధం. ఇప్పుడు రెండు పార్టీలు మళ్లీ ఈ ఆయుధాన్ని తమ వద్దకు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని అర్థమవుతోంది. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం ద్వారా చాలా నష్టపోయామని అనుకుంటున్న టీఆర్ఎస్ మరోసారి పాత చరిష్మాను పొందాలంటే ఉద్యమ గుర్తులన్నీ మళ్లీ ప్రజల ముందు ఉంచాలని అనుకుంటోంది. అందులో భాగమే దీక్షాదివస్. కాంగ్రెస్ కూడా సోనియా గాంధీ అంగీకరించకపోతే అసలు తెలంగాణ వచ్చేదే కాదని తెలంగాణ తల్లి సోనియా అని అంటున్నారు. వీరి పోటాపోటీ రాజకీయం మరోసారి తెలంగాణ రాజకీయాలను వేడెక్కిస్తోంది.

# విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలి...

- పాఠశాలలు, గురుకులాలను తరచూ తనిఖీ చేయాలి..
- విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందజేయాలి...
- జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశం..
- వసతిగృహాల్లో తరచూ ఘటనలో చోటుచేసుకోవడంపై సీఎం ఆగ్రహం..
- బాధ్యులైన వారిపై వేటు వేయాలని ఆదేశాలు....


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల పాఠశాల్లలో విద్యార్థులను కన్న బిడ్డల్లా చూడాలని, వారికి పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారం అందించడంలో ఎటువంటి అలక్ష్యానికి తావు ఇవ్వవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారానికి సంబంధించి చోటుచేసుకుంటున్న ఘటనలపై ముఖ్యమంత్రి పలుమార్లు సమీక్షించారు. కలెక్టర్లు తరచూ పాఠశాలల, వసతిగృహాలు, గురుకుల పాఠశాలలను తనిఖీ చేయాలని.. అనంతరం అందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా పొరపాట్లు చోటుచేసుకుంటుండంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఉదాశీనంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తప్పవని సీఎం హెచ్చరించారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు రుజువైతే వారిని ఉద్యోగాల నుంచి తొలగించేందుకు వెనుకాడమని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు మంచి విద్య అందించాలనే ఉద్దేశంతో వేల సంఖ్యలో ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టడంతో పాటు వారికి పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.. విద్యార్థుల విషయంలో తాము సానుకూల నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ కొందరు ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి శక్తుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని, బాధ్యులైన వారిని చట్టప్రకారం శిక్షిస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. వసతిగృహాల్లో ఆహారం విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా పుకార్లు సృష్టించడంతో పాటు లేని వార్తలను ప్రచారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని.... వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

## 31 డివిజన్ లో పర్యటించిన ఎమ్మెల్యే నాయిని,స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు



హన్మకొండ ప్రతినిధి నవంబర్ 29ప్రజా స్వేచ్ఛ
31 డివిజన్ హంటర్ రోడ్ లోని వాసవి కాలనీ గాయత్రి కాలనీ లో పర్యటించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజు.ఈ నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ...గత పాలకుల నిర్లక్ష్యం వల్లే అభివృద్ధి చెంద లేకపోయినా కాలనీలు అన్ని అభివృద్ధి చెందేలా చూస్తానని సిసి రోడ్డు డ్రైనేజీలు డివిజన్ల అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు చేపడుతుందని మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు సూచనలతో నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా నా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మాతోపాటు కాలనీ వాసులందరూ ముందుకు రావాలని మీరు సహకరిస్తే అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే,కార్పొరేటర్ లను సన్మానించి వారి అభిమానాన్ని చాటుకున్నారు ఈ కార్యక్రమంలో 31 డివిజన్,హంటర్ రోడ్డు కాలనీవాసులు,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలు

-ప్రతిభ కనబర్చిన జనగామ విద్యార్థులు...




రఘునాథపల్లి, నవంబర్,29 ప్రజా స్వేచ్ఛ
గ్రేటర్ వరంగల్ 47వ డివిజన్ పరిధిలోని నారాయణ ఇ టెక్నో స్కూల్లో నారాయణ ప్రీమియర్ లీగ్ క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , ఎంఈఓ మనోజ్ కుమార్, డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, జోనల్ డీజీఎం రిజ్వానా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. డీజీఎం రిజ్వానా మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని అన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. వరంగల్ జోనల్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, చెస్ పోటీల్లో జనగామ బ్రాంచ్ ప్రథమ స్థానంలో నిలిచి ట్రోఫీలను కైవసం చేసుకుంది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి, కోఆర్డినేటర్లు సాయి కృష్ణ, శ్యామల, శిరీష, ప్రిన్సిపాల్స్ ఫర్హానా, అనిత, అలేఖ్య, ఆర్ ఎస్ టి లక్ష్మతి, ఆర్ ఎన్ డి కమలాకర్, పీఈటీలు ఘన శ్యామ్, మహేష్, సుమన్ గౌడ్ పాల్గొన్నారు...

# శ్రీ షిరిడి సాయి బాబాపై అసత్య ప్రచారణ నిర్మూలన ఐక్య వేదిక కమిటీ




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
షిరిడి సాయి భక్త ఐక్యవేదిక కోరు కమిటీ ఆధ్వర్యంలో షిరిడి సాయిబాబా మందిరాల నిర్వాహక కమిటీల సమావేశం నాగోల్ దేవకి కన్వెన్షన్ హాల్లో ముఖ్య అతిథుల ఆధ్వర్యంలో శ్రీ గోరక్ష మహాదేవ్ గాడిల్కర్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సీఈవో శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ షిరిడి గారి ఆధ్వర్యంలో బాబాగారు ఒక మతానికి చెందిన వాడని వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఇలాంటి ఆరోపణలు చేసిన వారికి తగిన బుద్ధి చెబుతామని సంస్థ సీఈవో గో రక్షక్ మహదేవ్ గాడిల్కర్ హెచ్చరించారు శిరిడి సాయి భక్త ఐక్యవేదిక బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి సాయిబాబా మందిరాల నిర్వాహక కమిటీ వారు వారి సభ్యులతో సమావేశం లో కొంతమంది అసత్య ప్రచారం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని బాబా ఒక మతానికి చెందిన వాడు కాదని మరాటి సత్ చరిత్రలో పేర్కొన్నారని రుజువు కూడా చేశారని అసత్య ప్రచారాలను తిప్పికొడుతూ భక్తులకు ధైర్యం నింపేందుకు ఏర్పడిన ఐక్యవేదిక లో రాష్ట్రంలోని షిరిడి సాయిబాబా కమిటీ సభ్యులంతా ఒక్కటే బాబా పై అసత్య ప్రచారాన్ని తిప్పికొడదామని ఐక్యవేదిక అధ్యక్షుడు చింతపల్లిలోని శిరిడి సాయిబాబా సంస్థాన్ చైర్మన్ మంచి కంటి ధనంజయ పేర్కొన్నారు లక్ష్మీబాయి షిండే గ్రాండ్ డాటర్ శైలజమ్మ శైలజమ్మ షిండే గైక్వాడ్ గ్రాండ్ సన్ అరుణ్ షిండే గైక్వాడ్ మైనంపాటి జ్యోతి తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి తరిగొప్పుల అమరేందర్ ప్రజాపతి టిపిసిసి లీగల్ సెల్ మనోహర్ కోటేశ్వరరావు రవి శెట్టి నాగరాజు కొండర్ విజయలక్ష్మి కొల్లోజ్ పద్మ తంద్ర సాదు చంద్రకళాంజలి సాయి నగర్ కాలనీ సాయిబాబా టెంపుల్ సాయి సేవ దళ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం ఐక్యవేదిక అతిధులను ఐక్యవేదిక సభ్యులను ఘనంగా సన్మానించారు ఐక్యవేదిక సభ్యులు శ్యాం కుమార్ కే సాయి బాబా శ్రవణ్ కుమార్ శ్రీనివాస్ రెడ్డి హనుమంతు వెంకటరామిరెడ్డి ఈశ్వరమ్మ యాదవ్ రవీంద్రబాబు సాయిబాబా ప్రసాద్ రావు హరి ప్రసాద్ రావు మైనంపాటి ప్రసాద్ అనిల్ సాయి శ్రీనివాస్ చంద్రకుమార్ భాను ప్రతాప్ ఇందులో పాల్గొన్నారు

# ఆదానీప్రకటించిన వంద కోట్ల రూపాయల విరాళాన్ని స్వీకరించకూడదని నిర్ణయించిన రేవంత్ రెడ్డి


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
తెలంగాణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (చ%జూ=%) నిధుల కింద ఆదానీ ఫౌండేషన్ ప్రకటించిన వంద కోట్ల రూపాయల విరాళాన్ని స్వీకరించకూడదని నిర్ణయించినట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చెప్పారు. అదానీ గ్రూపునకు సంబంధించి ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు, వివాదాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు, సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారు, ఎమ్మెల్యే మందుల సామేల్ గారు, ఇతర నేతలతో కలిసి ముఖ్యమంత్రి గారు మీడియా సమావేశంలో మాట్లాడారు. అదానీ గ్రూపునకు సంబంధించి దేశ విదేశాల్లో దుమారం చెలరేగడం, ఆరోపణలు, ప్రత్యారోపణలు, చర్చోపచర్చలకు దారితీసిన తరుణంలో అలాంటి వివాదాల్లో తెలంగాణను చేర్చడం ఇష్టంలేక మంత్రులందరం కలిసి అదానీ ఫౌండేషన్ విరాళాన్ని స్వీకరించరాదని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు... యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కి ప్రకటించిన నిధులను బదిలీ చేయరాదని అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్‌కు పరిశ్రమల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గారు ఈనెల 24 వ తేదీన లేఖ రాశారు అదాని ఫౌండేషన్‌కు ఇప్పటికే లేఖ రాసిన విషయాన్ని సీఎంగారు ప్రస్తావిస్తూ, స్కిల్స్ యూనివర్సిటీ సీఎస్ఆర్ నిధుల కింద అనేక సంస్థలు విరాళం ప్రకటించినప్పటికీ ఇప్పటికి ఒక్క రూపాయి కూడా తెలంగాణ ఖాతాకు బదిలీ కాలేదన్నారు. స్కిల్స్ యూనివర్సిటీకి అవసరమైన కార్పస్ ఫండ్ కోసం ఆయా సంస్థలు ఇచ్చే నిధులపై 80%+% కింద ఆదాయపన్ను మినహాయింపు నిన్నమొన్ననే వచ్చిందని చెప్పారు. ఆ కారణంగా ఇప్పటివరకు ఏ సంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని అన్నారు. తాజా వివాదాల నేపథ్యంలో అదానీ ఫౌండేషన్ ప్రకటించిన నిధులను బదిలీ చేయొద్దని లేఖ రాయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ యువత ప్రపంచంతో పోటీ పడాలన్న సదుద్దేశంతో ఒక గొప్ప ఆలోచనతో ప్రారంభించిన స్కిల్స్ యూనివర్సిటీపై వివాదాలు రాకూడదనే అదానీ గ్రూపు విరాళం వద్దనుకుంటున్నట్లు చెప్పారు. అయితే, ఈ నిధుల విషయంలో కూడా రాజకీయ కోణంలో ఆరోపణలు చేయడం నిరుద్యోగ యువకులకు నష్టపరిచే విధంగా కొందరు వ్యవహరిస్తున్న తీరును ప్రజలు గమనించాలని కోరారు చట్ట బద్ధంగా, రాజ్యాంగ బద్ధంగా ఏదైనా కార్యక్రమంపై టెండర్లు పిలిచినా, పెట్టుబడులు పెట్టినా కచ్చితమైన నియమ నిబంధనలతో అన్ని సంస్థలు పాల్గొనేలా అవకాశం కల్పిస్తామని, నిబంధనల ప్రకారం ఏ సంస్థకు దక్కితే వారికి కాంట్రాక్టులను కేటాయించడమన్న విధానం అనుసరిస్తున్నామని స్పష్టం చేశారు. ఎవరికీ ఆయాచిత లబ్ది చేకూర్చే నిర్ణయాలను ప్రజా ప్రభుత్వం తీసుకోబోదని పునరుద్ఘాటించారు. అదానీ అయినా, అంబానీ అయినా, టాటా బిర్లాలైనా మరే ఇతర సంస్థ అయినా పెట్టుబడులు పెట్టడానికి అవకాశం ఉంటుందనే కాంగ్రెస్ విధానం రాహుల్ గాంధీ గారు ఇదివరకే తేల్చిచెప్పినట్లు సీఎం గారు గుర్తుచేశారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో తెలంగాణకు సంబంధించి కేంద్రం వద్ద ఉన్న పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర ఎంపీలతో ఢిల్లీలో చర్చిస్తామని తెలిపారు. ఎయిర్ పోర్టు, మెట్రో విస్తరణ, సాగునీటి కేటాయింపుల వంటి ప్రధానమైన అనేక పెండింగ్ అంశాలలో కేంద్రంపై ఒత్తిడి తెస్తామని, అనుకూలతను బట్టి పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర మంత్రులను కలుస్తామని సీఎం గారు పేర్కొన్నారు.

# 75వ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు...





**తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి**

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ

భారత దేశానికి అత్యున్నతమైన నిర్ణయాత్మక రాజ్యాంగం,సూచనాత్మక రాజ్యాంగం వ్రాయబడటం చాలా గొప్పవిషయం,బ్రిటిష్ ఏలుబడిలో రాజ్యాంగం ఉండాలన్న స్పృహ రావడ0 అభినందించదగ్గ విషయం .బ్రిటీష్ కాలానికి ముందు ఉన్న పీశ్వాల కాలం లో అంటరాని కులాల పరిస్థితి అమానుషం గా ఉండేది. అంటరాని కులాలు ముడ్డికి ముంత నడుముకు తాటకులు మెడలో కుండా చేతిలో గంట తో ఉండేవి.ఎవరైనా అంటరాని వాడు ఎదురుతిరిగితే గుర్రాలతో తొక్కించిన చరిత్ర పీష్వాలది.తరువాత జరిగిన "ప్లాసీ" యుద్ధం ,భీమాకోరేగావ్ యుద్ధం తో పీశ్వాల పైన ,దళితులు తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ అంటరాని కులం నుండి పుట్టిన ఒక ఆణిముత్యం రాజ్యాంగ రచన చేశారు .భారత దేశ అసెంబ్లీ మరియు కాంగ్రెస్ పార్టీ ఈ బృహత్తరమైన బాధ్యత బాబా సహేబ్ భుజస్కంధాలపై మోపింది .కృంగిపోని డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ గారు ఈ అవకాశాన్ని విడిచిపెట్టలేదు.

అంటరాని కులాలకు
గుక్కెడు నీళ్లు కూడా ఇవ్వని ఈ దేశం
పిడికెడు భూమి కూడా ఇవ్వని ఈ దేశం
అక్షరాలకు ముట్టును ఇచ్చిన ఈ దేశం
ముడ్డికి ముంత కట్టిన ఈ దేశం
అసలు మనిషిగా చూడని ఈ దేశం

అమానుషమైన కులాలను పుట్టించిన ఈ దేశం అదే కులం లో జన్మించిన ఒక వ్యక్తికి దేశం లో అత్యున్నతమైన రాజ్యాంగ రచన అవకాశం ఇచ్చింది.మనుస్మృతిని అనధికార రాజ్యాంగం గా అమలుపరుచుకుంటున్న ఈ దేశం లో భారతీయులకు మరో మనువు గా ఉండమని బాబాసాహెబ్ ని కోరింది .అవకాశం వచ్చిందే తడవు ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా రాజ్యాంగ రచనకు పూనుకున్న బాబాసాహెబ్ న్యాయం,స్వేచ్ఛ ,సమానత్వం,సౌభ్రాతృత్వం అంటే తెలియని దేశానికి సమానత్వం బోధించిన బోధిసత్వుని బోదనలనుండి రాజ్యాంగం ను వ్రాసారు.అప్పుడు బాబాసాహెబ్ నేను స్వేచ్ఛ ,సమానత్వం,సౌభ్రాతృత్వం ఫ్రెంచ్ విప్లవం నుండి గ్రహించాను అని కొందరు అంటారు .నేను బౌద్ధం నుండి గ్రహించాను అని ప్రకటిస్తారు.

**/రాజ్యాంగ రచన సంఘం //**

1947 ఆగస్ట్ 29 న డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ గారి అధ్యక్షతన 7 గురు సభ్యులతో (ఆయనతో కలిపి)
రాజ్యాంగ రచన సంఘం ఏర్పాటు అయ్యింది.మొదటి సమావేశం ఆగస్ట్ 30 ,1947 న జరిగింది.

**మిగితా 6గురు:**

1. .గోపాల స్వామి అయ్యర్
2.అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్
3.సయ్యద్ మహమ్మద్ సదుల్లా
4. K.M. మున్షీ
5. B.L .మిట్టర్( మిట్టర్ గారి అనారోగ్యం కారణంతో రాజీనామా తరువాత %చీ.వీ%.రావ్ గారిని ,5-12-1947న నియమించారు)
6.టి.టి.కృష్ణమాచారి.(డి.పి ఖైతాన్ గారి మరణంతో టి.టి కృష్ణమాచారి నియామకం జరిగింది)

బి ఎన్ రావు గారు డ్రాఫ్ట్ కమిటీకి కి సలహాదారుగా ఉన్నారు.

ఈ కమిటీ మొత్తము బాబాసాహెబ్ అధ్యక్షతన రాజ్యాంగం వ్రాయాలి కానీ అలా వ్రాయబడలేదు.డాక్టర్ బీఆర్ అంబెడ్కర్ గారు ఒక్కరే రాజ్యాంగం వ్రాసారు.
ఏడాక్టర్ అంబెడ్కర్ గారు ఒక్కరే రాజ్యాంగం వ్రాసారుఏ
న్యాయశాఖామంత్రిగా ,రాజ్యాంగ రచన బాధ్యతలు తీసుకొన్న బాబాసాహెబ్ ఒక్కరే రాజ్యాంగం వ్రాసారు అంటూ భారతదేశ అత్యున్నత అసెంబ్లీ లో
టి.టి కృష్ణమాచారి గారు నవంబర్ 5 ,1948 నాడు
ప్రకటించారు.ఆయన మాటల్లో...
ఈ కమిటీలో ఏడుగురు ఉన్నమాట వాస్తవం కానీ
??ఒక్కరు అనారోగ్య కారణాలతో రాజీనామా చేశారు. ఆ స్థానం లో ఇంకొకరిని నియమించాల్సి వచ్చింది.
??డి.పి ఖైతాన్ గారు మరణించారు.ఆయన స్థానం
అలాగే ఉంది. ఒకరు అమెరికాలో ఉన్నారు ఆయన స్దాన%శీ% ఖాళీగా ఉంది. మరొక సభ్యుడు రాష్ట్ర రాజకీయాల్లో బిజీ గా ఉన్నారు.రాజ్యాంగ రచనలో రావడానికి సమయం చిక్కలేదు.
??మిగితా ఇద్దరు ఢిల్లీ కి బాగా దూరంలో ఉండటం వలన వాళ్లకు వీలు పడలేదు అంటూ మాట్లాడారు. రాజ్యాంగం వ్రాయడానికి బాబాసాహెబ్ కి పట్టిన కాలం 2 సంవత్సరాల 11 నెలల 17 రోజులు.ఇంత తక్కువ కాలం లో ఏ దేశ రాజ్యాంగం వ్రాయబడలేదు.బ్రిటిష్ మ్యూజియం లో కొన్ని వేల పుస్తకాలు చదివిన అనుభవం .జ్ఞాన సముపార్జన కోసం ఎన్నో పరిశోధనలు చేసిన జ్ఞానపిపాసికి ఇది అంత కష్టమేమీ కాలేదు.కానీ ఆయన ఆరోగ్యం మాత్రం రాజ్యాంగ రచన కాలం లో బాగా చెడిపోయింది మాత్రం అని చెప్పొచ్చు.

**//బౌద్ధం - భారత దేశం - రాజ్యంగ చిహ్నాలు //**

బౌద్ధ ధమ్మాన్నిపూర్తిగా చదివిన బోధిసత్వ బాబాసాహెబ్ బౌద్ధ మార్కును రాజ్యాంగం లో పొందు పరిచారు.రాజ్యాంగ పీఠిక బౌద్ధ ధమ్మా పీఠక అనే చెప్పవచ్చు .రాజ్యాంగ చిహ్నం అయినా ఏనుగు బౌద్ధ లో ప్రాముఖ్యత ను కలిగి ఉంది.బుద్ధుని తల్లి కి కలలో కనబడింది ఏనుగునే అని బుద్దుస్ట్ గ్రంథాలలో లిఖించబడింది. భారత దేశ సార్వత్రిక సార్వభౌమానికి చిహ్నమైన నాలుగు సింహాలు బౌద్ధ చక్రవర్తి సామ్రాట్ అశోకుని సార్వభౌమత్వానికి చిహ్నం .భారత దేశ జెండాలో ఉన్న 8 ఆకుల అశోక చక్రం ,బౌద్ధం లో ని అష్టాంగ మార్గానికి చిహ్నం . 24 ఆకులున్న అశోక చక్రం 12 సూత్రాల "ప్రతిత్యసముత్పాద "కి గుర్తు.ఇలా బాబా సాహెబ్ భారత దేశ చిహ్నాల గుర్తింపు లో బౌద్ధాన్ని మేళవించారు.

భారతా దేశ అసెంబ్లీ లో ఈ రాజ్యాంగం పై చాలా చర్చలు జరిగాయి దాదాపుగా మెజారిటీ చర్చల్లో బాబా సాహెబ్ ఓపికగా సమాధానం చెప్పారు.కొన్ని సవరణల అనంతరం 26 నవ%శీ%బర్,1949 న భారత అసెంబ్లీ బాబాసాహెబ్ రాజ్యాంగం ను ఆమోదించింది .జనవరి 26 1950 న రాజ్యాంగం అమలు లోకి వచ్చింది.భారతదేశం మనుధర్మ శాస్త్ర పాలన నుండి రాజ్యాంగ పాలన లోకి వచ్చింది.

1927 డిసెంబర్ 25 న మనుధర్మశాస్త్రాన్ని కాలబెట్టిన బాబాసాహెబ్, 1950 జనవరి 26 న రాజ్యాంగం ను ఈ దేశం లో అమలు లోకి తేవడానికి కారణం అయ్యాడు.అదీ ప్రతిభ అంటే........
రాజ్యాంగం వ్రాయడానికి బాబా సాహెబ్ ప్రతిభనే కారణం.

**పూర్వ చరిత్ర......**

భారత రాజ్యంగము రచన దినము నా

**ఆందరికి జై భీమ్ లు ....**

ఈరోజున అంటే ఆగస్టు 29 1947 స్వతంత్ర భారత రాజ్యంగ ముసాయిదా రచనా సంఘము ఏర్పడిన రోజు .... మన దేశానికి రాజ్యంగము వ్రాయడానికి 7 గురు సభ్యులను ఎన్నుకోవడము జరిగింది ఆ 7 గురిలో డా.బాబాసాహేబ్ అంబేద్కర్ గారిని చైర్మేన్ గా నియమించారు....
మిగతా సభ్యుల వివరాలు
1...అల్లాడి క్రుష్న స్వామిఅయ్యర్
2...కే.యమ్ మున్షి
3. యన్.గోపాలస్వామి అయ్యంగార్
4.మహమ్మద్ సాదుల్లా
5.యన్ మాధవిమీనన్ 6.డి.పి.ఖైతాన్...
రాజ్యంగ రచనా పూర్తిగా అంబేద్కర్ మీదనే బారము పడింది ఎందుకంటే ఇద్దరు సబ్యులు యితర దేశాల కార్యకలాపాలో మునిగి పోయారు....
ఇంకోకరు అనారోగ్య కారణాలవల్ల,మిగతావారు కాంగ్రేస్ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు అందుచేత అంబేద్కర్ ఒక్కరి మీదనే బారము పడ్డము వల్ల ఆయన అనా రోగ్యము తో భాదపడుతునే అయనకు అప్పచేప్పిన భాద్యతను పూర్తిచేసి 1949 నవంబర్ 26 న అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్,ప్రదాని నేహ్రుకు అందచేయడము వారు ఆ రాజ్యంగ ప్రతిని అదే రోజు ఆమోదించడము జరిగింది ....
ఈ రాజ్యంగాన్ని జనవరి 26 ,1950 నుండి అమలు చేసారు...
భారత రాజ్యాంగం...మన దేశానికి పవిత్ర గ్రంథం. దేశభక్తి గురించి, నినాదాల గురించి, స్వేచ్ఛ గురించి ఎన్నిరకాల అభిప్రాయాలున్నా%జూ% అన్ని%శీ%టికీ రాజ్యాంగమే ఆదర్శం.... భారతీయుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది కాబట్టే రాజ్యాంగం అంటే అందరికీ అంత గౌరవం....అలాంటి రాజ్యాంగానికి కర్తకర్మ అన్నీ అంబేద్కరే.... స్వతంత్ర భారతదేశం భవిష్యత్ కు దిక్సూచిగా తన ఆత్మనే రాజ్యాంగ గ్రంథంగా రాసుకున్నారు అంబేద్కర్..... భారతజాతికి ఆయన ఇచ్చిన ఈ బహుమతి మతాలు, కులాలు, వర్గాలన్నిటినీ ఏకంగా చేసింది. ఏ తేడా లేకుండా ప్రతి పౌరుడికీ సమానమైన గుర్తింపు ఇచ్చింది. అందుకే అంబేద్కర్ అందరివాడయ్యారు....
అంబేద్కర్ ఆలోచనలే భారతీయులందరి ఆత్మగౌరవం.... అందుకే తరాలుగా అట్టడుగున ఉండిపోయిన ప్రజలకు ఆయన దేవుడు. ఆయన ఆలోచనలను కాదనేవాళ్లకు కూడా ఆయనే ఆదర్శం. అందరికీ కలిసి ఆయన శాశ్వత అవసరం. ఆ అవసరం అనివార్యంగా మారడానికి కారణం%జూ% మన రాజ్యాంగం. ఏ భేదం లేకుండా%జూ% భారత ప్రజలమైన మేము%జూ% అంటూ మొదలవుతుంది మన రాజ్యాంగం. ఈ ఒక్క మాటతో భారత నేలపై ఉన్న ప్రతి ఒక్కరూ సమానమే అని చెప్పారు అంబేద్కర్. అప్పటికే కులాలుగా, మతాలుగా విడిపోయిన భారతీయులను ఒకే ఒక్క మాటతో ఒక్కటి చేశారు. ఈ సమానత్వంతోనే అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో పాలన వ్యవస్థ ఇంకా నిర్మాణం కాని క్లిష్టమైన వాతావరణంలో మన రాజ్యాంగ రచన జరిగింది. దీనికి రచనా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. అంతకంటే ముందు ఆయన్ను అసలు రాజ్యాంగ సభకే వెళ్లకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించాయి అప్పుడున్న కొన్ని పార్టీలు.... కానీ భారతజాతికి దిశను చూపించే రాజ్యాంగ రచనకు అంబేద్కర్ మాత్రమే సరైనవ్యక్తి అని నాటి సభ్యులు చెప్పడము జరిగింది .... తర్వాత రాజ్యాంగ రచన మొదలుపెట్టారు. మనదేశం కంటే ముందే చాలా దేశాలు రాజ్యాంగాలు రాసుకున్నాయి....అలా 130కి పైగా దేశాల రాజ్యాంగాలను చదివారు అంబేద్కర్. అవన్నీ అధ్యయనం చేసి మనకు అవసరం అనుకున్నవి, మన దేశ పరిస్థితులకు తగినట్టుగా మార్పులు చేశారు....
మనదేశంలోని రకరకాల సమాజాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందో చాలా ముందుగానే అంచనా వేసి వాటికి పరిష్కారాలు చూపించేలా రాజ్యాంగ రచన చేశారు అంబేద్కర్.... దేశంలో పటిష్ఠమైన వ్యవస్థల్ని నిర్మించేలా రాజ్యాంగంలో నిర్దేశించారు అంబేద్కర్. ఏ వ్యవస్థ తప్పు చేసినా మరో వ్యవస్థ దాన్ని సరిదిద్దేలా అద్భుతమైన నిర్మాణాన్ని ఏర్పాటు చేశారు. ఏ వర్గాన్నీ పాలకులు నిర్లక్ష్యం చేసే అవకాశం లేకుండా చేశారు. పాలకులు దారితప్పితే ప్రజలు ప్రశ్నించే హక్కు ఇచ్చారు. హక్కులతో పాటు ప్రభుత్వాలను గైడ్ చేసేలా ఆదేశిక సూత్రాలను ఇచ్చారు. మనకంటే చాలా ముందుగా రాజ్యాంగం రాసుకున్న అమెరికా వ్యవస్థ కూడా కొన్ని సమస్యలకు పరిష్కారం చూపించలేకపోయింది.... కొన్ని పరిష్కారం లేని సమస్యల్ని సృష్టించింది. కానీ మన రాజ్యాంగం భవిష్యత్ ను చాలా ముందుగా ఊహించి పరిష్కారాలు చూపేలా రచించారు అంబేద్కర్.... కొన్ని దేశాల్లో పన్ను కట్టేవాళ్లే ఓటర్లు. కొన్ని దేశాల్లో ఇంకొన్ని అర్హతలున్నవాళ్లకే ఓటు. వాటన్నిటికీ భిన్నంగా దేశంలో ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించారు అంబేద్కర్. టాటా, బిర్లా అయినా%జూ% రోజు కూలీ అయినా ఓటుకు ఒకటే విలువ. ఇదే అంబేద్కర్ ప్రతిపాదించిన అసలైన ప్రజాస్వామిక సిద్ధాంతం.... అంబేద్కర్ న్యాయశాస్త్రంలో డాక్టరేట్ సాధించారు.... మనదేశంలో సామాజిక వివక్ష ఎలా ఉంటుందో, ఎదగడానికి ఎన్ని కష్టాలుంటాయో ఆయనకు బాగా తెలుసు. అందుకే పౌరహక్కుల విలువను బాగా అర్థం చేసుకున్న వ్యక్తిగా వాటిని రాజ్యాంగంలో మొదటి ప్రాధాన్యం ఇచ్చారు. వాటిని ఎవరూ కాదనే అవకాశం లేకుండా తిరుగులేని రక్షణ కల్పించారు. ప్రజల చుట్టూనే వ్యవస్థ పనిచేసేలా చేశారు. ప్రతి పౌరుడూ తన ఆలోచనలు చెప్పుకోగలిగేలా భావప్రకటనా స్వేచ్ఛను ఇస్తూ ఆర్టికల్ 19 రూపొందించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రాథమిక హక్కుల్ని పార్లమెంట్ కూడా ఉల్లంఘించే పరిస్థితి లేకుండా చేశారు అంబేద్కర్.... దేశంలో మత, కుల, లింగ వివక్ష లేకుండా అందరూ సమానంగా జీవించే స్వేచ్ఛనిస్తూ దాన్ని రాజ్యాంగబద్ధం చేశారు బాబా సాహెబ్. అర్టికల్స్ 14, 15, 16లలో సమానత్వ హక్కులు కల్పించారు. ఇవే దశాబ్దాలుగా దేశంలో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రక్షణకవచాలుగా నిలుస్తున్నాయి. దేశంలోని ప్రజలకు తిండి, బట్ట, ఉద్యోగం ఇవాల్సిన బాధ్యతను ప్రభుత్వాలపైనే పెట్టారు అంబేద్కర్. అందరికీ సమాన అవకాశాలుండాలని చెప్పారు. మహిళలకు రాజకీయ స్వాతంత్ర్యం ఉండాలని చెప్పిన అరుదైన నేత అంబేద్కర్. దళితుల కోసం మాత్రమే కాదు దేశంలోని అన్ని వర్గాల ప్రజల హక్కుల కోసం పోరాడిన అసమాన నాయకుడు బాబా సాహెబ్. అంబేద్కర్ ను చదవకుండానే ఆయన్ను దళిత నాయకుడిగా ముద్రవేసిన చాలామందికి ఆయన చెప్పిన సమానత్వం ఎప్పటికీ అర్థం కుండానే ఉండిపోయింది. దేశంలో ఎన్ని మతాలు, కులాలు, జాతులు, భాషలు ఉన్నా భారతజాతి సమైక్యతను,సమగ్రతను కోరుకున్నాడు బాబాసాహెబ్ అంబేద్కర్ గారు.... ప్రాథమిక హక్కుల పరిపూర్ణ తత్వానికి ఆదేశిక సూత్రాలు జీవనాధారంగా ఉన్నపుడే సంక్షేమ రాజ్యం సాధ్యం అవుతుంది ... ఐక్యరాజ్య సమితి (%ఖచీ%) పౌరుల ఎదుగుదల వారి వికాసము అవిభాజ్యము అనుఉల్లంఘనీయమైన " మానవ హక్కులు " అని ప్రకటించడానికంటే ముందే ఈ ఆదేశిక సూత్రాలును రూపొందించిన ఘనత అంబెద్కర్ గారికీ చెల్లుతుంది ..
జై భీమ్..జై బాబా సాహెబ్ అంబేద్కర్..

# బిజినెస్

## అమెజాన్ బ్లాక్ ఫ్రైడే ఆఫర్లు..

### ఈ బ్యాంకుల కార్డులపై 10 శాతం డిస్కౌంట్..!




ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ బ్లాక్ ఫ్రైడే సేల్ ప్రారంభమైంది. శుక్రవారం నుంచి వచ్చేనెల రెండో తేదీ వరకూ ఈ సేల్ కొనసాగుతుంది. అమెరికాలో షాపింగ్ సీజన్ ప్రారంభానికి సూచికగా బ్లాక్ ఫ్రైడే సేల్ నిర్వహిస్తారు. దేశీయంగా నాలుగు రోజుల పాటు సాగే బ్లాక్ ఫ్రైడే సేల్ లో స్మార్ట్ ఫోన్లు, టీవీలు, ఇతర గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తులపై అమెజాన్ ఆకర్షణీయ ఆఫర్లు అందిస్తున్నది. శాంసంగ్ గెలాక్సీ ఎస్23 ఫోన్ ఎంఆర్పీ రూ.1,24,999 కాగా, ఆఫర్ కింద రూ.74,999లకే అందుబాటులోకి వస్తుంది. ఆపిల్, ఐక్యూ, వన్‌ప్లస్, రియల్‌మీ, రెడ్‌మీ, టెక్నో స్మార్ట్ ఫోన్లతోపాటు ఎలక్ట్రానిక్ వస్తువులపై 40 శాతం నుంచి 75 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నట్లు అమెజాన్ వెల్లడించింది. ఎయిర్ కండీషనర్లపై 65 శాతం డిస్కౌంట్ అందిస్తోంది. ఆపిల్ మ్యాక్ బుక్ ఎయిర్ ఎం1-2020 లాప్ టాప్ ఎంఆర్పీ ధర రూ.89,900 కాగా, ఆఫర్ కింద రూ.59,990లకు లభిస్తుంది. యాక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, వన్ కార్డు, హెచ్డీఎఫ్సీ బ్యాంకు కార్డులపై పది శాతం డిస్కౌంట్ అందిస్తోంది.

## భారీగా పెరిగిన బంగారం వెండి ధరలు..!

దేశీయ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరలు దోబూచులాడుతున్నాయి. ఒకరోజు ధర పెరిగితే, మరొక రోజు తగ్గుముఖం పడుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.700 వృద్ధితో రూ.79,400 పలికింది. అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా దేశీయంగా స్థానిక జ్యువెల్లరీల నుంచి తాజా కొనుగోళ్ల మద్దతు లభించడంతో బంగారం ధర పెరిగింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.700 పెరిగి రూ.79 వేలు పలికింది. గురువారం తులం బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.78,700 వద్ద స్థిర పడింది. గురువారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.78,300 పలికింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.1,300 వృద్ధితో రూ. 92,200 వద్ద నిలిచింది. గురువారం రూ.4,900 పతనమై రూ.90,900 లకు పరిమితమైంది.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో డిసెంబర్ డెలివరీ బంగారం తులం



ధర రూ.602 వృద్ధి చెంది రూ.76,326లకు చేరుకున్నది. కిలో వెండి కాంట్రాక్ట్స్ డిసెంబర్ డెలివరీ ధర రూ.1,049 పుంజుకుని రూ.89,051లకు పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్ ఔన్స్ ధర 20.60 డాలర్లు వృద్ధితో 2,685 డాలర్లకు చేరుకున్నది. ఔన్స్ వెండి ధర 1.94 శాతం పెరిగి 31.15 డాలర్లు పలికింది. ఇన్వెస్టర్లు వచ్చేవారం యూఎస్ ఫెడ్ రిజర్వ్ సమీక్షపై దృష్టి సారిచారని అబాన్స్ హెూల్డింగ్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా తెలిపారు.

## ఎల్ఐసీ చేతికి మణిపాల్‌సిగ్నా!

-50 శాతం వాటా కొనుగోలుకు ఆసక్తి
-ఇరు వర్గాల మధ్య కొనసాగుతున్న చర్చలు
-హెల్త్ ఇన్సూరెన్స్‌లోకి ఎంట్రీ దిశగా అడుగులు




న్యూఢిల్లీ,
దేశీయ అతిపెద్ద బీమా సంస్థ, ప్రభుత్వ రంగ జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ).. ఆరోగ్య బీమాలోకి ప్రవేశించే అంశంలో స్పీడ్ పెంచింది. ఇందులో భాగంగానే మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో 50 శాతందాకా వాటాను కొనేందుకు గట్టిగా చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. హెల్త్ ఇన్సూరెన్స్ వ్యాపారంలోకి వెళ్దామని ఎల్ఐసీ ఎప్పట్నుంచో యోచిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్తగా ఓ సంస్థను పెట్టి దానిద్వారా ఈ సెగ్మెంట్‌లో ముందుకెళ్లడం కంటే ఇప్పటికే ఉన్న సంస్థలో వాటాను సొంతం చేసుకొని వెళ్లడమే లాభదాయకం అని ఎల్ఐసీ భావిస్తున్నట్టు తెలుస్తున్నది. అందుకే మణిపాల్‌సిగ్నాలో వాటాల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నట్టు చెప్తున్నారు. ఈ నెల 8న ఎల్ఐసీ త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటన సందర్భంగా కంపెనీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతీ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి ఆఖర్లోగా ఇప్పటికే ఆరోగ్య బీమా సేవల్ని అందిస్తున్న కంపెనీలో వాటాను కొంటామని, తద్వారా ఈ విభాగంలోకి వస్తామని ఆయన చెప్పారు. అయితే ఏ సంస్థలో వాటాను కొంటామన్న వివరాల్ని మాత్రం తెలియపర్చలేదు.

## కొనసాగుతోన్న తిలక్ వర్మ జోరు


టీ20 క్రికెట్‌లో టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ జోరు కొనసాగుతోంది. సౌతాఫ్రికా గడ్డపై వరుసగా రెండు శతకాలు నమోదు చేసిన ఈ హైదరాబాద్ బ్యాటర్.. ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలోనూ అదే జోరు కొనసాగిస్తున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకం బాది పొట్టి ఫార్మాట్‌లోనే హ్యాట్రిక్ సెంచరీలు బాదిన తొలి బ్యాటర్‌గా తిలక్ వర్మ చరిత్రకెక్కిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో హైదరాబాద్ జట్టుకు సారథిగా వ్యవహరిస్తున్న తిలక్ వర్మ.. మేఘాలయతో జరిగిన తొలి మ్యాచ్‌లో 151 పరుగులతో చెలరేగాడు. బెంగాల్‌తో జరిగిన తదుపరి మ్యాచ్‌లో 57 పరుగులతో రాణించాడు. రాజస్థాన్‌తో 13 పరుగులే చేసి విఫలమైన తిలక్ వర్మ.. బిహార్‌తో తాజాగా జరిగిన మ్యాచ్‌లో అజేయ హాఫ్ సెంచరీతో చెలరేగాడు. సౌతాఫ్రికా గడ్డపై అందుకున్న ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ఐపీఎల్ 2025 సీజన్‌కు ముందు ప్రత్యర్థి జట్లను



హెచ్చరిస్తున్నాడు. తిలక్ వర్మను ముంబై ఇండియన్స్ రూ.8 కోట్లకు రిటైన్ చేసుకున్న విషయం తెలిసిందే. బిహార్‌తో తాజాగా జరిగిన మ్యాచ్‌లోనూ హైదరాబాద్ 9 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బిహార్.. నిర్ణీత 20 ఓవరల్లో 9 వికెట్లకు 118 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో రవి తేజ(4/26) నాలుగు వికెట్లతో సత్తా చాటగా.. సీవీ మిలింద్, అజయ్ దేవ్ గౌడ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. నితిన్ సాయి యాదవ్‌కు ఓ వికెట్ దక్కింది. అనంతరం హైదరాబాద్ 12.3 ఓవర్లలో వికెట్ నష్టానికి 119 పరుగులు చేసి ఘన విజయాన్నందుకుంది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(8) విఫలమైనా.. రోహిత్ రాయుడు(33 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 56 నాటౌట్), తిలక్ వర్మ(31 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 51 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీలతో రాణించారు. ఈ టోర్నీలో గ్రూప్-ఏలో ఉన్న హైదరాబాద్.. 4 మ్యాచ్‌లకు రెండు గెలిచి రెండు ఓడి నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

# స్పోర్ట్స్

## హార్దిక్ మరోసారి విధ్వంసం



దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య విధ్వంసకర బ్యాటింగ్ కొనసాగిస్తున్నాడు. తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో ఒకే ఓవర్‌లో 29 పరుగుల ఊచకోతను మరువకముందే త్రిపురపై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పర్వేజ్ సుల్తాన్ వేసిన ఓవర్‌లో నాలుగు సిక్సర్లు, ఓ బౌండరీతో 28 పరుగులు పిండుకున్నాడు. బరోడాను మరోసారి విజయతీరాలకు చేర్చాడు. గ్రూప్-బీలో భాగంగా ఇండోర్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో బరోడా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు ఆడిన బరోడా అన్నింట్లోనూ గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన త్రిపుర నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లకు 109 పరుగులు చేసింది. కెప్టెన్ మన్‌దీప్ (50బీ 40 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్సర్) అర్ధశతకం సాధించాడు. అభిమన్యు సింగ్ (3/19) మూడు, కృనాల్ పాండ్య (2/22) రెండు వికెట్లు తీశారు.అనంతరం ఛేదనలో బరోడా 11.2 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సాధించింది. హార్దిక్ పాండ్య (47బీ 23 బంతుల్లో, 3 ఫోర్లు, 5 సిక్సర్లు), మితేశ్ పటేల్ (37బీ 24 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) దూకుడుగా ఆడారు. మణిశంకర్, సౌరభ్, పర్వేజ్ తలో వికెట్ తీశారు. అయితే పర్వేజ్ వేసిన 10 ఓవర్‌లో హార్దిక్ శివమెత్తాడు. తొలి బంతిని కవర్స్ మీదుగా సిక్సర్ బాదాడు. రెండో బంతికి పరుగులేమి చేయని హార్దిక్ ఆ తర్వాతి రెండు బంతుల్ని స్క్వేర్ లెగ్, మిడాఫ్ మీదుగా స్టాండ్స్‌కు తరలించాడు. అనంతరం థర్డ్ మ్యాన్ దిశగా బౌండరీ బాదిన ఈ స్టార్ ఆల్‌రౌండర్ ఆఖరి బంతిని మిడాఫ్ మీదుగా మరో సిక్సర్ బాదాడు. తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో గుర్జప్‌నీత్ సింగ్ వేసిన ఓవర్‌లో హార్దిక్ విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. నాలుగు సిక్సర్లు, ఓ బౌండరీతో ఏకంగా 29 పరుగులు వచ్చాయి. ఇటీవల జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో ఎడమచేతి వాటం బౌలర్ గుర్జప్‌నీత్ సింగ్‌ను సీఎస్కే రూ.2.2 కోట్లు వెచ్చించి తీసుకుంది.

## పాకిస్థాన్‌లో భారత్ పర్యటించదు


-విదేశాంగ శాఖ కీలక ప్రకటన
-భారత మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించాలి
-ఐసీసీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి సూచన

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం టీమిండియా.. పాకిస్థాన్ పర్యటనకు వెళ్లదని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఓవైపు ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణపై ఐసీసీ సమావేశం జరుగుతున్న వేళ.. భారత విదేశాంగ శాఖ ప్రకటన చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే పాకిస్థాన్‌లో పర్యటించలేమని, తమ మ్యాచ్‌లను తటస్థ వేదికల్లో నిర్వహించాలని ఐసీసీకి భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) సూచించింది. భద్రతాపరమైన కారణాలతోనే పాక్‌లో పర్యటించలేమని స్పష్టం చేసింది. దాంతో హైబ్రిడ్ మోడల్‌లో టోర్నీని నిర్వహించేందుకు ఐసీసీ ప్రయత్నాలు చేస్తుండగా..





అందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అంగీకరించడం లేదు. ఈ క్రమంలోనే ఐసీసీ శుక్రవారం కీలక సమావేశం ఏర్పాటు చేసింది. టోర్నీ నిర్వహణపై మరికొద్ది గంటల్లో తుది నిర్ణయం తీసుకోనుంది. ఇంతలోనే పాక్‌కు భారత జట్టును పంపించలేమని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. 'ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్‌లో పర్యటించే విషయంపై ఇప్పటికే బీసీసీఐ తమ ప్రకటనను విడుదల చేసింది. అక్కడ భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. అందుకే భారత జట్టును పంపించలేమని పేర్కొంది. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకున్నాం. కాబట్టి, టీమిండియా పాకిస్థాన్‌కు వెళ్లే అవకాశం లేదు.'అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ పేర్కొన్నారు. మరోవైపు హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించవద్దని పీసీబీకి ఆ దేశ ప్రభుత్వం సూచించింది. అవసరమైతే టోర్నీ నుంచి తప్పుకోవాలని కూడా సలహా ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. ఒకవేళ ఐసీసీ హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ అంగీకరించకపోతే పాకిస్థాన్‌కు తీవ్ర నష్టం జరగనుంది.

ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA



# పుష్ప-2 నుంచి పీలింగ్స్ సాంగ్ ప్రోమో రిలీజ్

టాలీవుడ్, పాన్ ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా మూవీ లవర్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా పుష్ప 2 ది రూల్. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్‌లో అల్లు అర్జున్ మరోసారి టైటిల్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు రానున్న విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో వరుస అప్‌డేట్‌లను ఇస్తుంది చిత్రబృందం. ఈ మూవీ నుంచి ఇప్పటికే ట్రైలర్‌తో పాటు మూడు పాటలను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా మరో సాంగ్‌ను అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ మూవీ నుంచి పీలింగ్స్ అనే పాట ప్రోమోను పుష్ప టీమ్ తాజాగా విడుదల చేసింది. కొచ్చిలో జరిగిన మూవీ ఈవెంట్‌లో అల్లు అర్జున్ ఈ పాట గురించి అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించిన ప్రోమోను వదిలారు. ఈ పాటలోని పల్లవి లిరిక్స్‌కు సంబంధించి అన్ని భాషల్లోనూ మలయాళంలోనే ఉండనున్నాయి. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఈ ప్రోమోను మీరు చూసేయండి.



# బిజీగా మారిన త్రిష

## సినీమాల మీద సినీమాలు

బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో బిజీగా ఉన్న స్టార్ హీరోయిన్లలో టాప్‌లో ఉంటుంది చెన్నై సోయగం త్రిష. ఈ భామ ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో లీడింగ్ హీరోలతో సినిమాలు చేస్తోంది. త్రిష ఖాతాలో అజిత్ కుమార్ నటిస్తోన్న విదాముయార్చి, చిరంజీవి నటిస్తోన్న విశ్వంభర సినిమాలున్నాయి. దీంతోపాటు మాలీవుడ్ యాక్టర్ టొవినో థామస్ నటిస్తోన్న ప్రాజెక్ట్ కూడా ఉంది. కాగా 2025 జనవరిలో త్రిష అభిమానులు, ఫాలోవర్లకు డబుల్ ట్రీట్ ఇవ్వబోతుందన్న వార్త నెట్టింట రౌండప్ చేస్తోంది. విదాముయార్చి 2025 పొంగళ్ కానుకగా రాబోతున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. మరోవైపు టొవినో థామస్ సినిమా కూడా జనవరిలోనే రాబోతుంది. టొవినో థామస్‌తో చేస్తున్న ఐడెంటిటీ మలయాళంలో త్రిష రెండో ప్రాజెక్ట్. ఈ రెండు సినిమాల విడుదల తేదీలపై క్లారిటీ రావాల్సి ఉండగా.. తాజా వార్తల ప్రకారం ఒకేసారి త్రిష డబుల్ ట్రీట్ ఇవ్వబోతుండటం ఖాయమైనట్టే. ఈ లెక్కన త్రిష అభిమానులకు మాత్రం పండగే అని చెప్పాలి. మరోవైపు మోహన్ లాల్‌తో రామ్, అజిత్ కుమార్-అధిక్ రవిచంద్రన్ గుడ్ బ్యాడ్ అగ్లీ ప్రాజెక్ట్, మణిరత్నం-కమల్ హాసన్ థగ్ లైఫ్ సినిమాలు కూడా త్రిష లైన్‌లో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన విదాముయార్చి టీజర్‌కు మంచి స్పందన వస్తోంది.



# అవును వచ్చే నెలలోనే నా పెళ్లి

గత కొంత కాలంగా జరుగుతున్న పెళ్లి ప్రచారంపై అగ్ర కథానాయిక కీర్తి సురేశ్ తాజాగా స్పందించారు. ఆ వార్తలను నిజం చేస్తూ.. వచ్చే నెలలో తన బాయ్‌ఫ్రెండ్‌ను పెళ్లాడనున్నట్లు స్పష్టం చేశారు.కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కీర్తి సురేశ్ సందర్శించుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపల కీర్తి సురేశ్ మాట్లాడారు. ఈ మేరకు పెళ్లి వార్తలపై స్పష్టతనిచ్చారు. గోవాలో తన పెళ్లి జరగనున్నట్లు ప్రకటించారు. అందుకే స్వామివారి దర్శనానికి వచ్చినట్లు వెల్లడించారు. మరోవైపు తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై కీర్తి సురేష్ బుధవారం అధికారిక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ప్రియుడు ఆంటోనీతో దీపావళి సందర్భంగా తీసుకున్న ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసింది. తమ స్నేహబంధం జీవితాంతం కొనసాగనుందని తెలిపింది. ఈ వార్త తెలుసుకున్న పలువురు సినీ సెలబ్రిటీలు కీర్తి సురేష్‌కు శుభాకాంక్షలు అందజేశారు. ఇక రిపోర్ట్స్ ప్రకారం.. డిసెంబర్ 11, 12 తెదీల్లో గ్రాండ్ వెడ్డింగ్ జరగనున్నట్లు తెలిసింది. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నట్లు సమాచారం.




# గేమ్ ఛేంజర్ నుంచి నాలుగో పాట, ట్రైలర్

## ప్లాన్ అదుర్స్

స్టార్ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో గ్లోబల్ స్టార్ రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం గేమ్‌ఛేంజర్. బాలీవుడ్ భామ కియారా అద్వానీ, రాజోలు భామ అంజలి ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2025 జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనుండగా.. ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది శంకర్ టీం. గేమ్‌ఛేంజర్ నుంచి తాజాగా లాంచ్ చేసిన మూడో సాంగ్ నానా హైరానా ఫుల్ లిరికల్ వీడియో సాంగ్ కలర్‌ఫుల్‌గా సాగుతూ విజువల్ ట్రీట్ పక్కా అని చెబుతోంది. మరోవైపు ఇప్పటికే రిలీజ్ చేసిన రా మచ్చ, జరగండి జరగండి సాంగ్‌కు నెట్టింట మంచి స్పందన వస్తోంది. అప్పుడే నాలుగో పాట విడుదలతోపాటు ట్రైలర్ అప్‌డేట్‌కు సంబంధించిన వార్త అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం నాలుగో సింగిల్ డిసెంబర్ రెండోవారంలో రాబోతుంది. జనవరి మొదటివారంలో ట్రైలర్‌ను లాంచ్ చేయబోతున్నారు. నాలుగో పాట రాంచరణ్, అంజలి కాంబినేషన్‌లో వచ్చే మెలోడీ సాంగ్ అని తెలుస్తుండగా.. ఇది ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌లో రాబోతుందట. అయితే మేకర్స్ నుంచి దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో నవీన్ చంద్ర, సునీల్, శ్రీకాంత్, బాలీవుడ్ యాక్టర్ హ్యారీ జోష్, ఎస్‌జే సూర్య, సముద్రఖని, కన్నడ నటుడు జయరామ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు నిర్మిస్తుండగా..ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492